



గాంధీ సర్కిల్ వద్ద తవ్వి వదిలేసిన రోడ్డు



కొల్లాపురమ్మ సర్కిల్ వద్ద డ్రైనేజీ కాలువ లేక.. రోడ్డుపైనే మురుగునీరు

రూ. 9 కోట్లు రోడ్డపాలు

- డ్రైనేజీ కాలువలు లేకుండా నిర్మాణం
- మురుగునీటి మయమైన కళ్యాణదుర్గం
- అప్పటి మంత్రి ఉష శ్రీచరణ్ ఘనకార్యం

అస్తవ్యస్తంగా రహదారి పనులు

ఓట్లేసి గెలిపించిన ప్రజలకు ఐదేళ్లపాటు ఏమీ చేసింది లేదు. ఎన్నికల ప్రచారానికి వెళితే.. ఏదో ఒకటి చెప్పాలి. మాయ చేసి గెలవాలి. ఇలా ఆలోచించారు అప్పటి మంత్రి ఉష శ్రీచరణ్. అవినీతి ఆరోపణలు, సొంత పార్టీ నాయకుల తిరుగుబాటుతో అప్పటికే పీకల్లోతు కూరుకుపోయిన ఆమె.. తనకు టిక్కెట్ కళ్యాణదుర్గంలోనే వస్తుందని అనుకున్నారు. ఎలాగోలా గెలిచేద్దామని అనుకున్నారు. అందుకే.. ప్రచారాస్త్రంగా పనికి వస్తుందని పట్టణంలో రహదారి పనులను ఆగమేఘాల మీద చేపట్టారు. పోనీ నాణ్యత పాటించారా అంటే.. అందులోనూ కమీషన్లను వదల్లేదు. ఆర్ అండ్ బీ అధికారులు, అప్పటి మంత్రి.. అందరికీ వాటాలు వెళ్లాయన్న ఆరోపణలు వచ్చాయి. వెరసి.. పనులు అధ్వానంగా అయ్యాయి. అదీ.. మురుగునీటి కాలువలు లేకుండా.. దారి పనులు చేసి వదిలేశారు. ఇప్పుడు వర్షం కురిస్తే నీరు రోడ్డుపై నిలబడుతోంది.

కళ్యాణదుర్గం, ఆగస్టు 6: కళ్యాణదుర్గం టి-కూడలి నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు రోడ్డు వేసేందుకు వైసీపీ హయాంలో ఆర్అండ్‌బీ రూ.9 కోట్ల నిధులు మంజూరు చేసింది. మొత్తం 12 కి.మీ. తారు రోడ్డు, మధ్యలో డివైడర్లు, రెండు వైపులా డ్రైనేజీ కాలువలన నిర్మించాల్సి ఉంది. గత ఏడాది ఏప్రిల్ 6న అప్పటి మంత్రి ఉష శ్రీచరణ్ ఈ పనులను ప్రారంభించారు. ఎన్నికలు దగ్గరపడుతున్నాయని, ఎలాగైనా పనులు త్వరగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించడంతో ఆర్ అండ్ బీ అధికారులు మమ అనిపించారు. ప్రజా ధనాన్ని వృథా చేశారు. ఫలితంగా టి-సర్కిల్, వాల్మీకి సర్కిల్, గాంధీ సర్కిల్, హిందూపురం రోడ్డులో రహదారి విస్తరణ పనులు అధ్వానంగా మారాయి. గాంధీ సర్కిల్, కొల్లాపురమ్మ దేవాలయ సమీపంలో డ్రైనేజీ



ఏర్పాటు చేయకుండానే రోడ్డు విస్తరణ పనులు చేయడంతో మురుగునీరు రోడ్డు పైకి వస్తోంది. ఈ ప్రాంతమంతా ఎగుడుదిగుడుగా రోడ్డు వేయడంతో మురుగునీరు రోడ్డు మధ్యలోనే నిలిచిపోతోంది. వర్షం వస్తే పట్టణ వాసుల బాధ వర్ణణాతీతం.

> **మిగిలిన పనులను చేయిస్తాం..**
> రోడ్డు విస్తరణ పనులు చేసిన కాంట్రాక్టర్లకు ఇంకా బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఎన్నికల కోడ్ కారణంగా కొంత వరకు మాత్రమే పనులు పూర్తి చేశాం. మిగిలిన పనులను పూర్తి చేయిస్తాం. డ్రైనేజీ కాలువలు ఎందుకు వేయలేదో తెలియదు. మా ఉన్నతాధికారులను అడగండి.
> - గోవిందరాజులు, ఆర్అండ్‌బీ ఏఈ, కళ్యాణదుర్గం

మధ్యలోనే ఆపేశారు..

గాంధీ సర్కిల్‌లో రోడ్డు విస్తరణ పనులు మధ్యలోనే ఆపేశారు. దీంతో గుంతల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. పాదచారులు, వాహదారులు గాయపడుతున్నారు. హిందూపురం వెళ్లే రహదారిలో బ్రిడ్జి నిర్మిస్తేనే పూర్తి స్థాయిలో భద్రత ఉంటుంది. నిత్యం వందలాది వాహనాలు, అధిక సామర్థ్యం కలిగిన వాహనాలు ఈ రహదారి గుండా వెళ్లాలి. ఇంతటి కీలకమైన ప్రాంతంలో తూతూ మంత్రంగా పనులు చేశారు. మురుగునీరు పోవడానికి పైపులు వేశారు. రోడ్డు పనులను అర్ధంతరంగా నిలిపేశారు. దీంతో వాహనదారులు ఆగి ఆగి.. నెమ్మదిగా వెళ్లాల్సి వస్తోంది. డివైడర్లు

> **ఇష్టారాజ్యంగా చేశారు..**
> రోడ్డు విస్తరణలో అక్రమాలు జరిగాయి. కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా పనులు చేశారు. ఆర్అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నిస్తే అందుబాటులో ఉండటం లేదు. గాంధీచౌక్ నుంచి కంబదూరు రోడ్డు వరకు డ్రైనేజీ వ్యవస్థ లేదు. మురుగునీరు రోడ్లపైకి వస్తోంది. రోడ్డు మీదనే విద్యుత్ స్తంభాలు ఉన్నాయి. రాత్రిళ్లు వాహనదారులు ప్రమదాలకు గురవుతున్నారు.
> - అచ్యుత్ ప్రసాద్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు



ఎలా పడితే అలా వేశారు. సగం నిర్మించి వదిలేశారు. హిందూపురం రోడ్డు పొడవునా డివైడర్లు అన్నీ సగమే నిర్మించి వదిలేశారు. ఇది ప్రమాదాలకు కారణం అవుతోంది.

నిధులు వృథా

అప్పటి మంత్రి స్వార్థానికి రూ.9 కోట్ల నిధులు రోడ్డుపాలయ్యాయి. త్వరగా ఆ పనులు పూర్తి చేయాలని అధికారులపై ఆమె ఒత్తిడి చేయడంతో అధికారులు నాణ్యతా ప్రమాణాలను పట్టించుకోలేదు. కాంట్రాక్టర్ ఏది చేస్తే అది అన్నట్లు నడిచిపోయింది. పైగా.. వాటా కమీషన్ అందడంతో సంతృప్తి చెందారు. రోడ్డు విస్తరణను అక్కడక్కడ మీటర్ల కొద్దీ వదిలేశారు. డ్రైనేజీ వ్యవస్థ లేకుండా పట్టణంలో రహదారులను నిర్మించడం ఏమిటని జనం ప్రశ్నిస్తున్నారు. ఇప్పుడు రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ కాలువలను నిర్మించాలంటే వేసిన రోడ్డంతా ధ్వంసం చేయాల్సిందే.

రైతులను మింగుతున్న అప్పులు

ఒకే రోజు ఇద్దరి బలవన్మరణం



సురేష్ (ఫైల్)



చెట్టుకు వేలాడుతున్న రైతు దండా సురేష్..

రాయదుర్గం రూరల్/ కళ్యాణ దుర్గం, ఆగస్టు 6: అన్నదాతల బలవన్మరణాలకు అడ్డుకట్ట పడటం లేదు. ఏ పంట పెట్టినా నష్టాలు వెంటాడుతుండటంతో దిక్కుతోచక ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. అప్పులు తీర్చేమార్గం లేక అర్ధంతరంగా వెళ్లిపోతున్నారు. జిల్లాలో మంగళవారం ఇద్దరు రైతులు ఉరి వేసుకోవం రైతాంగ సంక్షోభానికి అద్దం పడుతోంది. కంబదూరు మండలం రాళ్ల అనంతపురం గ్రామానికి చెందిన దండా సురేష్(30), రాయదుర్గం మండలం టి.వీరాపురం గ్రామానికి చెందిన రైతు ఓబన్న(41) తోట పంటలను సాగుచేసి తీవ్రంగా నష్టపోయారు. లక్షలాది రూపాయల అప్పులు పేరుకుపోవడంతో ఉరి వేసుకున్నారు. ఓబన్నకు రెండు ఎకరాల పొలం ఉంది. మరో మూడెకరాలను కౌలుకు తీసుకున్నాడు. టమోటా, కర్బూజ, బ్యాడిగి మిర్చి సాగు చేశాడు. పెట్టుబడి కోసం రూ.15 లక్షల వరకు అప్పు చేశాడు. దిగుబడి సరిగా రాకపోవడం, గిట్టుబాటు ధర లభించకపోవడంతో వడ్డీలు కూడా కట్టలేకపోయాడు. దిక్కుతోచక ఇంట్లో ఉరివేసుకున్నాడు. పోలీసులు మృతదేహాన్ని రాయదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భార్య ఈరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

తోట వద్ద ఉరి..



ఓబన్న (ఫైల్)

దండా సురేష్‌కు ఆరు ఎకరాల పొలం ఉంది. టమోటా, కర్బూజ పంటలను సాగు చేశాడు. పెట్టుబడుల కోసం బ్యాంకులు, వడ్డీ వ్యాపారుల వద్ద రూ.8 లక్షలకు పైగా అప్పులు చేశాడు. ఎంత శ్రమించినా గట్టెక్కలేకపోయాడు. తీవ్రంగా నష్టపోయి.. దిక్కుతోచని స్థితిని ఎదుర్కొన్నాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదని ప్రతి రోజూ భార్య మంజుల వద్ద ఆవేదన వ్యక్తం చేసేవాడు. బతుకు భారాన్ని భరించలేక తోట వద్ద చెట్టుకు ఉరి వేసుకున్నాడు. చుట్టుపక్కల వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. చెట్టుకు వేలాడుతున్న భర్తను చూసి మంజుల గుండెలవిసేలా రోదించింది. ఇద్దరు కుమారులను ఎలా పెంచాలని, ఇక తమకు దిక్కెవరని కన్నీరుమున్నీరైంది. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తరఫున టీడీపీ నాయకుడు అల్లుడు ధర్మతేజ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అధికారులకు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశం

అహుడా నిబంధనలను అమలు చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం రూరల్, ఆగస్టు 6: అహుడా పరిధిలో ఇళ్ల స్థలాలలే అవుట్లు, ఇతర విషయాల్లో నిబంధనలు కచ్చితంగా పాటించేలా చూడాలని ఎమ్మెల్యే పరిటాల సునీత అధికారులను ఆదేశించారు. నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆమె అహుడా అధికారులతో సమావేశం నిర్వహించారు. రియల్టర్లు నిబంధనలను పాటిస్తున్నారా అని ప్రశ్నించారు. ప్రజలు ప్లాట్లు కొనుగోలు చేయకముందే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. లేదంటే ప్రజలు నష్టపోతారని అన్నారు. రాప్తాడు పరిధిలో పెండింగ్ ఫైల్స్‌ని వెంటనే క్లియర్ చేయాలని ఆదేశించారు. పాపంపేటలో ప్రధాన సమస్యగా మారిన 30 అడుగల రోడ్డు గురించి సుదీర్ఘంగా చర్చించారు. కళ్యాణదుర్గం రోడ్డు నుంచి బళ్లారి రోడ్డుకు వెళ్లే మార్గంలో ప్రస్తుతం 30 అడుగల రోడ్డు ఉంది. దీనిని 60 అడుగల రోడ్డుగా మార్చేందుకు అహుడా అధికారులు చర్యలు చేపట్టారు. కానీ స్థానికులు మాత్రం 30 అడుగల రోడ్డు సరిపోతుందని, ఎలాంటి సమస్య లేదని ఎమ్మెల్యే దృష్టి తెచ్చారు. ఇక్కడున్నదంతా నిరుపేదలేని ఎమ్మెల్యేకి ఇటీవల వివరించారు. ఈ నేపథ్యంలో అధికారులతో రోడ్డు విస్తరణ గురించి ఎమ్మెల్యే చర్చించారు. గతంలో మాస్టర్ ప్లాన్ ప్రకారం అది బండి జాడ రోడ్డు అని, 12 అడుగుల రోడ్డు మాత్రమే ఉండేదని, ఆ తరువాత 30 అడుగుల రోడ్డుగా మారిందని, ప్రజలకు ఇబ్బంది లేనప్పుడు విస్తరణ ఎందుకని ప్రశ్నించారు. అహుడా అధికారులు మాత్రం కనీసం 40 అడుగులైనా రోడ్డు ఉండాలని ప్రతిపాదించగా, అన్ని అంశాలు మరోసారి పరిశీలించి, ప్రజలకు ఇబ్బంది లేకుండా నిర్ణయం తీసుకుందామని ఎమ్మెల్యే అన్నారు. అహుడా అధికారులు, మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, మాజీ మండల కన్వీనర్ చల్లా జయకృష్ణ స్థానిక టీడీపీ నాయకులు, డీలర్లు రామాంజినేయులు, బాబావలి పాల్గొన్నారు.

ఐఎస్ఓ గుర్తింపు వచ్చేనా..?

అనంతపురం టౌన్, ఆగస్టు 6: కలెక్టరేట్‌కు ఐఎస్ఓ గుర్తింపు సాధించేందుకు యంత్రాంగం కృషి చేస్తోంది. కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశాలతో ఐఎస్ఓ ప్రమాణాలకు అనుగుణంగా కలెక్టరేట్‌లోని అన్ని విభాగాలలో మార్పులు తెచ్చారు. ఈ నేపథ్యంలో హైదరాబాదు నుంచి ఐఎస్ఓ బృందం ప్రతినిధులు కేఎస్ఎన్ ప్రసాద్, రాజేష్, సింగయ్య కలెక్టరేట్‌ను మంగళవారం సందర్శించారు. అన్ని విభాగాలను పరిశీలించారు. ఐఎస్ఓ గుర్తింపు రావాలంటే 39 రకాల ప్రమాణాలు పాటించాల్సి ఉంటుందని, ఆ దిశగా మార్పులు చేశామని డీఆర్వో రామకృష్ణారెడ్డి తెలిపారు. కలెక్టరేట్ ఏఓ మారుతి, డిప్యూటీ కలెక్టర్ ఆనంద్, సెక్షన్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో ఐఎస్ఓ బృందం ప్రతినిధులు

ఉద్యాన పథకాలకు దరఖాస్తు చేసుకోండి

జిల్లా ఉద్యాన శాఖ అధికారి నరసింహారావు

అనంతపురం అర్బన్, ఆగస్టు 6: ఉద్యాన పథకాలకు రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఆ శాఖ ఇన్‌చార్జి అధికారి నరసింహారావు సూచించారు. తన కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఈ ఏడాది రూ.6.91 కోట్లతో ఉద్యాన పథకాలు అమలు చేస్తామని అన్నారు. రూ.5.76 కోట్లతో ఉద్యాన సమగ్ర అభివృద్ధి పథకం (ఎంఐడీహెచ్), రూ.1.15 కోట్లతో రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్‌కేవీవై) పథకాల అమలుకు కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆమోదం తెలిపారని అన్నారు. మామిడి, జామ, చీనీ, దానిమ్మ, సీతాఫలం, డ్రాగన్ ఫ్రూట్, అంజూర, నేరేడు పంటలు సాగు చేసే రైతులకు మూడేళ్లపాటు మొక్కల ఖరీదు, ఎరువులు, పురుగుమందుల ఖరీదులో 40 శాతం రాయితీ వర్తింపజేస్తామని అన్నారు. గులాబీ, బంతి, చామంతి, కనకాంబరం తదితర పూల తోటలు పెంచే రైతులకు హెక్టారుకు రూ.16 వేల దాకా రాయితీ వర్తింపజేస్తా వ ు ని అన్నారు. నీటి ఎద్దడి కలిగిన పొలాల్లో నీటి గుంతలు ఏర్పాటు చేసుకునేందుకు రూ.50 శాతం సబ్సిడీతో గరిష్ఠంగా రూ.75 వేలు అందజేస్తామన్నారు. రైతు సంఘాలకు కమ్యూనిటీ ఫారం పాండ్స్ ఏర్పాటు చేసేందుకు రూ.20 లక్షల దాకా రాయితీ అందజేస్తామని అన్నారు. దానిమ్మ, ద్రాక్ష రైతులు పండ్లను పక్షుల నుంచి కాపాడుకునేందుకు యాంటీ బర్డ్ నెట్స్ ఏర్పాటు చేసుకునేందుకు హెక్టారుకు రూ.33వేల దాకా రాయితీ కల్పిస్తామని తెలిపారు. పోస్ట్ హర్వెస్ట్ మేనేజ్‌మెంట్ పథకం ద్వారా ఉద్యాన రైతులు ప్యాక్ హౌస్‌లు నిర్మాణం చేసుకునేందుకు రూ.2 లక్షల వరకు 50 శాతం రాయితీ అందజేస్తామని అన్నారు. రైతు సంఘాలకు ప్రత్యేకంగా కలెక్షన్స్ సెంటర్లు, సోలార్ కోల్డ్ రూమ్‌లు నిర్మించుకునేందుకు 75 శాతం రాయితీ అందజేస్తామని అన్నారు. తైవాన్ స్ప్రేయర్లు, ట్రాక్టర్ మౌంటెడ్ స్ప్రేయ ు ర్లను 50 శాతం రాయితీతో ఇస్తామని తెలిపారు. ఆర్‌కేవీవై పథకం ద్వారా హైబ్రిడ్ విత్తనాలు కొనుగోలు చేసి నాటుకున్న రైతులకు హెక్టారుకు రూ.3 వేల దాకా రాయితీ వర్తింపజేస్తామని తెలిపారు. పెండాల్స్ పద్ధతిలో రాతి స్తంభాలపై తీగ జాతి కూరగాయలు పండించే రైతులకు 50 శాతం రాయితీతో ఎకరాకు రూ.లక్ష దాకా ఇస్తామని తెలిపారు. ఈ ఏడాది 300 హెక్టార్లల్లో ఆయిల్ పామ్ సాగు కోసం మొక్కలు అందజేసి ప్రోత్సహిస్తామని తెలిపారు. ఆయిల్ ఫామ్ సాగు కోసం తొలి విడతలో కూడేరు, ఉరవకొండ, వజ్రకరూరు, కణేకల్లు, బొమ్మనహాళ్, డి.హీరేహాళ్ మండలాలను ఎంపిక చేశామని, ఈ ప్రాంతంలో నీటి వసతి కలిగిన ఒక్కో రైతుకు 25 హెక్టార్ల దాకా రాయితీ అందజేస్తామని తెలిపారు. ఉద్యాన రైతులు స్థానిక ఉద్యాన అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



మీడియాతో మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన శాఖ ఇన్‌చార్జి అధికారి నరసింహారావు

అభివృద్ధిపై సీఎం సానుకూల స్పందన

కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో చర్చిస్తున్న కలెక్టర్, ఎస్పీ

అనంతపురం టౌన్, ఆగస్టు 6: జిల్లా అభివృద్ధి అంశాలపై సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. సీఎం నిర్వహించిన సమీక్షలో పాల్గొనేందుకు అమరావతికి వెళ్లి కలెక్టర్, ఎస్పీ మురళీ కృష్ణ.. జిల్లా అభివృద్ధి గురించి సీఎం, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కలిసి జిల్లా అభివృద్ధి గురించి చర్చించారు. తాగునీటికి నిధులు, గురుకుల పాఠశాలల్లో సీట్ల పెంపు, హార్టికల్చర్, మైక్రో ఇరిగేషన్ టార్గెట్ పెంపు, పీఏబీఆర్, హంద్రీనీవా పథకాల గురించి వారికి వివరించామని కలెక్టర్ తెలిపారు. అన్నింటికీ సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారని అన్నారు. హార్టికల్చర్, మైక్రో ఇరిగేషన్ అంశాలో దేశంలో మన జిల్లా ఐదు, ఆరు స్థానాలలో ఉందని, ఒకటో స్థానంలో నిలపాలని సీఎం సూచించారని అన్నారు. జిల్లాలో చెరువులన్నింటినీ ఎలా నింపాలో కూడా సీఎం తమకు తెలిపారని అన్నారు. జిల్లా ప్రగతిపై సీఎం స్పందన ఎంతో ఆనందం కలిగించిందని అన్నారు. సీఎం సూచన మేరకు నిరంతరం కష్టపడి పనిచేస్తామని, జిల్లా అభివృద్ధికి పాటుపడుతామని అన్నారు.

త్వరగా కోలుకో నేస్తం..!



విద్యార్థి తండ్రికి డబ్బులు అందజేస్తున్న విద్యార్థులు

కణేకల్లు మండలం పూలచెర్ల ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న వన్నూరుస్వామి ఆదివారం బైక్‌పై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. తలకు దెబ్బ తగలడంతో తల్లిదండ్రులు బళ్లారిలోని ఓ ఆసుపత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న తోటి విద్యార్థులు.. తమ స్నేహితుడి వైద్యం కోసం సాయం అందించారు. అశ్విత్, మహేంద్ర, కౌశిఫ్ తదితరులు రూ.22 వేలను సేకరించారు. ఉపాధ్యాయులతో కలిసి ఈ సొమ్మును వన్నూరుస్వామి తండ్రికి మంగళవారం పాఠశాలలో అందజేశారు. తమ స్నేహితుడు త్వరగా కోలుకుని బడికి తిరిగి రావాలని ఆకాంక్షించారు. - కణేకల్లు




డ్వామా కార్యాలయం

డ్వామాలో డ్రామా

మండలానికి ఇద్దరు ఏపీఓలు

- టీఏలకు ఇన్‌చార్జి బాధ్యతలు
- సిఫారసులు, మామూళ్లకే పెద్దపీట

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 6: డ్వామాలో అక్రమ వ్యవహారాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. డెప్యుటేషన్లు, మండలానికి ఇద్దరూ ఏపీఓలు, పీడీ కార్యాలయంలో విధులు, మండలాల్లో జీతాలు తీసుకోవడం, టెక్నికల్ అసిస్టెంట్లను ఇన్‌చార్జ్ ఏపీఓలుగా నియమించడం వంటి అనేక అక్రమ కార్యక్రమాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. గత రెండేళ్లుగా సాగుతున్న ఈ అక్రమ వ్యవహా రాల వెనుక సిఫారసులు, భారీగా ముడుపులు చేతులు మారాయనే ఆరోపణలు ఉన్నాయి. అప్పట్లో వైసీపీ ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లకు తలొగ్గిన డ్వామా అధికారులు పరిమితికి మించి, నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగులను డెప్యుటేషన్ వేశారు. దీంతో డ్వామాలో పాలన గాడితప్పడంతో పాటు పట్టు కోల్పోయింది. ఓవైపు ఉపాధి హామీ పథకంలో పురోగతి తగ్గడం, మరోవైపు సిబ్బంది కొరతతో ఇబ్బందులు పడుతున్నారు. డ్వామాలో అక్రమ బదిలీలు, అనవసర డెప్యుటేషన్ల తతంగం మొత్తం హెచ్‌ఆర్ విభాగానికి ముడిపడి ఉంటుంది.



డ్వామా హెచ్‌ఆర్ నుంచే మొత్తం తతంగం

డ్వామాలో హెచ్ ఆర్ విభాగం కీలకంగా పని చేస్తోంది. ఇందులో ఏళ్ల నుంచి పాతుకుపోయిన ఫెవికాల్ వీరులు డ్వామాలో డ్రామా నడిపిస్తున్నారు. గతంలో అనేక ఆరోపణలు ఎదుర్కొని బదిలీపై చిత్తూరు వెళ్లిన హెచ్‌ఆర్ మేనేజర్ వైసీపీ నాయకుల సహకారంతో తిరిగి ఇక్కడికే వచ్చారు. ఇదే విభాగంలో పనిచేస్తున్న ఓ కంప్యూటర్ ఆపరేటర్ పదేళ్ల నుంచి ఇక్కడే పనిచేస్తున్నారు. మధ్యలో ఓ మూడు నెలలు మాత్రం హిందూపురానికి చుట్టపుచూపుగా అలా వెళ్లి ఇలా వచ్చేశారు. దీంతో డ్వామాలో హెచ్‌ఆర్ విభాగంలో పనిచేస్తున్న సిబ్బంది చెప్పిందే నడుస్తోంది.

సామాజిక తనిఖీల ద్వారా తేల్చిన నిధుల దుర్వినియోగం రికవరీ చేయడంలో హెచ్‌ఆర్ విభాగం కీలకంగా పనిచేస్తుంది. అయితే హెచ్‌ఆర్ విభాగంలోనే వసూళ్లకు తెరలేపడంతో ఇక డ్వామా మొత్తం పరిపాలన అస్తవ్యస్తంగా మారింది.

ఆ మండలాలకు ఎందుకో ప్రత్యేకత

మండలానికి ఒక ఏపీఓ ఉండాల్సిన చోట కొన్ని మండలాల్లో ఇద్దరు ఏపీఓలను నియమించారు. బుక్కరాయసముద్రం మండలంలో సుజాత, పోలేరయ్య, రా ప్సాడ ు సావిత్రమ్మ, ఓబన్న పనిచేస్తున్నారు. గార్లదిన్నె మండలంలో మురళీకృష్ణ, నాచారమ్మ ఏపీఓలుగా ఉన్నారు. పామిడి మండలంలో విజయభారతి, మల్లేశ్వరి ఉన్నారు. నార్పల మండలంలో రామారావు, ఎర్రమ్మ పని చేస్తున్నారు. డ్వామా పీడీ కార్యాలయంలో ఆదినారాయణమ్మ, సుజాత డెప్యుటేషన్‌పై ఉన్నారు. కంబదూరు, బెళుగుప్ప, కళ్యాణదుర్గం, రాయదుర్గం, డి.హీరేహాళ్, శెట్టూరు మండలాలకు ఏపీఓలు లేకపోవడంతో టెక్నికల్ అసిస్టెంట్లను ఇన్‌చార్జిలుగా నియమించారు.

విజిలెన్స్‌లో పేరు నమోదైతే పండగే

డ్వామా పరిధిలో ఉపాధి హామీ పథకం, వాటర్‌షెడ్ పథకాలు ఉన్నాయి. ఇందు లో పనిచేస్తున్న సిబ్బంది అవకతవకలకు పాల్పడినట్లు విజిలెన్ విభాగం తనిఖీల్లో వెల్లడైతే చాలు హెచ్‌ఆర్, విజిలెన్స్ సిబ్బందికి పండగే. సామాజిక తనిఖీ ద్వారా విజిలెన్స్ గుర్తించిన నిధుల దుర్వినియోగాన్ని ఆసరాగా చేసుకుని వసూళ్లకు దిగుతున్నారు. ఇటీవల కళ్యాణదుర్గం ప్రాంతానికి చెందిన ఓ ఉపాధి ఉద్యోగి ద్వారా సామాజిక తనిఖీ పేరుతో హెచ్ ఆర్ విభాగం వసూలు చేసినట్లు సమాచారం. డ్వామా హెచ్‌ఆర్ విభాగంలో ఇలాంటివి సర్వసాధారణంగా జరుగుతూనే ఉన్నాయి. ఇలాంటి ఘటనలపై కొత్త ప్రభుత్వం దృష్టి సారించి నివారించాల్సిన అవసరం ఉంది.



లక్ష్మీ కటాక్షం ఏదీ ?

అర్చకులకు ఆర్థిక కష్టాలు

- డీడీఎన్‌ఎస్ లేదు..వేతనాలూ అందడం లేదు..
- డెత్ గ్రాట్యుటీ ఫైళ్లను కదిలించని అధికారులు
- దేవదాయశాఖపై పూజారుల ఆగ్రహం
- కూటమి ప్రభుత్వంలోనైనా తీరు మారేనా..?



అనంతపురం మొదటి రోడ్డులోని శివాలయం

నిత్యం దైవారాధన చేసే అర్చకులు ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. సమస్యలను పరిష్కరించాలని దేవదాయ శాఖ చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని పలువురు అర్చకులకు డీడీఎన్‌ఎస్ (ధూపదీప నైవేద్యం), ధార్మిక పరిషత్ వేతనాలు అందడం లేదు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 3,115 ఆలయాలు దేవదాయశాఖ పరిధిలో ఉన్నాయి. వీటిలో 6ఏ గ్రూప్ కింద కసాపురం, గవిమఠం, గూగూడు, పెద్దపప్పూరు, పంపనూరు, నేమకల్లు, మురిడి, పెన్నహోబిలం, ఆలూరుకోన, తొండపాడు, భక్తరహళ్లి, కదిరి ఆలయాలు ఉన్నాయి. వీటి వార్షిక ఆదాయం రూ.25 లక్షల నుంచి రూ.కోటికి పైగా ఉంటుంది.

- అనంతపురం కల్చరల్

భారీగా ఆదాయం

- కసాపురం, కదిరి ఆలయాల వార్షికాదాయం రూ.10 కోట్లకు పైగానే ఉంటుంది. అందుకే ఈ ఆలయాలకు డిప్యూటీ కమిషనర్ హోదా అధికారి ఈఓగా ఉంటారు. రూ.5కోట్లకు పైగా వార్షికాదాయం ఉన్న గవిమఠం ఆలయానికి సహాయ కమిషనర్ హోదా అధికారి ఈఓగా బాధ్యతలు నిర్వహిస్తుంటారు.
- రూ.5లక్షల నుంచి రూ.25లక్షలలోపు వార్షికాదాయం కలిగిన ఆలయాలను 6బీ గ్రూపుకింద, రూ.50వేల నుంచి రూ.5లక్షలలోపు ఆదాయమున్న ఆలయాలను 6సీ గ్రూపుకింద పరిగణిస్తారు. రూ.50వేలలోపు వార్షికాదాయమున్న ఆలయాలకు గతంలో టీడీపీ ప్రభుత్వం డీడీఎన్‌ఎస్ పథకాన్ని, అర్హత కలిగిన అర్చకులకు ధార్మిక పరిషత్ కింద వేతనాలను ప్రవేశపెట్టింది. డీడీఎన్‌ఎస్ కింద రూ.5వేలు, ధార్మిక పరిషత్ కింద అర్చకులకు వేతనంగా రూ.15,625 అందజేసేవారు. అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా 2,500 మంది అర్చకులు డీడీఎన్‌ఎస్, ధార్మిక పరిషత్ వేతనాలు పొందేవారు. గత వైసీపీ ప్రభుత్వం డీడీఎన్‌ఎస్‌ను రూ.10వేలకు పెంచుతామన్న హామీ ఇచ్చినా అమలు చేయలేదు.



అలసత్వం తగదు...

దేవదాయశాఖ అధికారుల అలసత్వం వల్ల అర్చకులు నష్టపోవాల్సి వస్తోంది. డీడీఎన్‌ఎస్, ధార్మిక పరిషత్ వేతనాల బకాయిలు, డెత్ గ్రాట్యుటీ పెండింగ్ వంటి వాటికి సంబంధించిన ఫైళ్లను అధికారులు పరిష్కరించకుండా చోద్యం చూస్తున్నారు. సమస్యలు తెలిపేందుకు సహాయ కమిషనర్ కార్యాలయానికి వెళ్తే కనీసం లోపలికి కూడా అనుమతించకపోవడం దారుణం.

- ఆంజనేయులు, ఏపీ అర్చక సమాఖ్య జిల్లా అధ్యక్షుడు

స్పందన లేదు..

నా భర్త అనంతయ్య మృతి చెంది ఏడాదిన్నర అవుతోంది. ఆయన తదనంతరం అర్చకుడిగా కొనసాగుతున్న నా కుమారుడు పవన్‌కుమార్‌కు డీడీఎన్‌ఎస్ వర్తింపజేయాలని దేవదాయశాఖ అధికారులను కోరాం. అయినా స్పందన కరువయ్యింది.



- హేమావతి, రాంపురం

మంచి రోజులు వచ్చేనా..?

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా డీడీఎన్‌ఎస్ అర్చకుల సంఖ్య 8 వేలకు పైగా ఉంది. వీరిలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 677 మంది డీడీఎన్‌ఎస్, ధార్మిక పరిషత్ కింద 183 మంది వేతనాలు పొందుతున్నారు. కూటమి ప్రభుత్వంలో డీడీఎన్‌ఎస్‌ను రూ.10వేలకు పెంచుతూ దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఇప్పటికే సంతకం చేశారు. దీంతో అర్చకుల్లో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. డీడీఎన్‌ఎస్ అర్చకులకు తరచూ బ్యాంకు ఖాతాల ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ సమస్యలు తలెత్తుతుండడంతో ఖాతాల్లో సొమ్ము జత కావడం లేదు. దానిని పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

అందని డెత్ గ్రాట్యుటీ

ఉరవకొండ మండలం రాంపురం గ్రామానికి చెందిన ఆంజనేయస్వామి దేవాలయ అర్చకుడు అనంతయ్య 2023 జనవరి 24న మృతి చెందారు. ఆయన తదనంతరం కుమారుడికి డీడీఎన్‌ఎస్ వర్తింపజేయాల్సి ఉంది. అయితే ఏడాదిన్నర కావస్తున్నా ఇంత వరకూ అధికారులు చర్యలు చేపట్టలేదు. కుందుర్పిలోని శివాలయ పూజారి పంచాంగం రాంబాబు 2023 ఆగస్టు 15న మృతి చెందితే ఆయన డెత్ గ్రాట్యుటీని కుటుంబ సభ్యులకు ఇప్పటికీ అందించలేదు. జిల్లా సహాయ కమిషనర్ కార్యాలయంలో ఈ ఫైల్‌కు మోక్షం లభించకపోవడం దారుణం. ఇలా దాదాపు 30 మంది అర్చకులకు సంబంధించిన ఫైళ్ల పెండింగ్‌లో ఉన్నాయంటే దేవదాయ శాఖ నిర్లక్ష్య వైఖరి అర్థమవుతోంది.

యథాప్రకారం నడవనున్న రైళ్లు



గుంతకల్లు, ఆగస్టు 6: జిల్లాలోని పెనుకొండ-మక్కాజిపల్లి సెక్షన్‌లో జరుగుతున్న నాన్ ఇంటర్లాకింగ్ పనుల కారణంగా రద్దు చేసిన రైళ్లను పునరుద్ధరించినట్లు రైల్వే అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గుంతకల్లు-హిందూపురం (నెం. 07693) రైలును ఈ నెల 8, 10 తేదీల్లో, దీని తిరుగు ప్రయాణపు డెము రైలు (నెం. 07694)ను 9, 11 తేదీల్లో పాక్షికంగా రద్దుచేయడానికి నిర్ణయించామని, కానీ ఆ రైళ్లను ఆ తేదీల్లో యథా ప్రకారంగా నడుపుతామని తెలిపారు. అలాగే కాచిగూడ-యశ్వంతపూర్ వందే భారత్ (నెం. 20703) రైలును ఈ నెల 3, 6, 11 తేదీల్లో దారి మళ్లించడానికి నిర్ణయించామని, కానీ 6, 11 తేదీల్లో యథా ప్రకారంగా రైళ్లను నడుపుతామన్నారు. కలబురగి-బెంగళూరు వందే భారత్ (నెం. 22231) రైలును 6న, యశ్వంతపూర్-కాచిగూడ వందేభారత్ (నెం. 20704) రైలును, బెంగళూరు-కలబురగి వందే భారత్ (నెం. 22232) రైలును 11న దారి మళ్లించనున్నట్లు ప్రకటించామని, కానీ ఆ నిర్ణయాన్ని ఉపసంహరించి రైళ్లను యథాప్రకారంగా నడుపుతామని వివరించారు.

రైళ్ల రద్దు: ట్రాక్ నిర్వహణ పనుల కారణంగా గుంతకల్లు-అనంతపురం మీదుగా వెళ్లే అప్ అండ్ డౌన్ ఎక్స్‌ప్రెస్ ప్రత్యేక రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. హౌరా-యశ్వంతపూర్ ప్రత్యేక రైలు (నెం. 02863)ను ఈ నెల 8, 15 తేదీల్లోనూ, దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 02864)ను ఈ నెల 10, 17 తేదీల్లో రద్దు చేసినట్లు తెలిపారు.

రేపు ఉద్యోగ మేళా

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 6: నిరుద్యోగ యువకుల కోసం గురువారం కు ఉద్యోగ మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కళ్యాణి మంగళవారం ప్రకటనలో తెలిపారు. నవభారత్ ఫర్టిలైజర్స్, పేటీఎం సంస్థల్లో సేల్స్ రెప్రజెంటీవ్స్ ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేసేందుకు 210మంది అభ్యర్థులు కావాలన్నారు. పది నుంచి డిగ్రీ వరకు చదివిన వారు అర్హులని తెలిపారు. ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు.

గూగూడులో హుండీల ఆదాయం లెక్కింపు

నార్పల, ఆగస్టు 6: గూగూడు కుళ్లాయిస్వామి, ఆంజనేయస్వామి హుండీల ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. ఈ రెండు హుండీలను పూర్తిగా లెక్కించగా ఆంజనేయస్వామి హుండీకి రూ.6,84,310లు, కుళ్లాయిస్వామి హుండీకి రూ. 1,05,708లు అలాగే వెండి 60కేజీలు, బంగారం 79గ్రాములు వచ్చినట్లు ఆలయ ఈఓ శోభ తెలిపారు.

వాయుపుత్రా..! వందనం

ప్రారంభమైన శ్రావణ మాసోత్సవాలు



అంకాలాలలో నెట్టికంటి ఆంజనేయస్వామి మూలవిరాట్టు



ప్రత్యేక అలంకరణలో మురడి ఆంజనేయస్వామి



పుష్పాలంకరణలో నేమకల్లు ఆంజనేయస్వామి

గుంతకల్లు, ఆగస్టు6: శ్రావణ మాస తొలి మంగళవారం సందర్భంగా కసాపురంలోని నెట్టికంటి స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జాము నుంచే స్వామివారి దర్శనార్థం భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారి మూల విరాట్టుకు అభిషేకాలు, వజ్రకవచ, పుష్పాలంకారాలు చేశారు. రాత్రి స్వామివార్ల ఉత్సవ విగ్రహాలకు అలంకారాలుచేసి వెండి రథంపై ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమాలలో ఈఓ వై భద్రాజీ, ధర్మకర్తల మండలి ఛైర్‌పర్సన్ కే సుగుణమ్మ, ఏఈఓ మల్లికార్జున, సూపరింటెండెంటు వెంకటేశులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు గ్రామంలో వెలసిన ఆంజనేయ స్వామికి శ్రావణమాసం తొలి మంగళవారం విశేషపూజలు జరిగాయి. ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్‌చార్యులు, సంతోష్‌కుమార్‌చార్యులు పూజలు జరిపించారు. రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నదానం చేశారు.

డీ.హీరేహాళ్: శ్రావణమాసం మొదటి మంగళవారం ప్రసిద్ధిగాంచిన మురడి ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే సుప్రభాతసేవ కుంకుమార్చన, బిల్వార్చన, సహస్రనామార్చన తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం స్వామివారిని ప్రత్యేక పూలు, ఆభరణాలతో వస్త్రాలంకరణ చేసి పూజలు చేపట్టారు.

ఔట్‌సోర్సింగ్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం క్రైం,ఆగస్టు 6: జిల్లా కోర్టు ఆవరణలోని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ ఆఫీస్‌లో ఔట్‌సోర్సింగ్ విధానంలో నాలుగు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా జడ్జి శ్రీనివాస్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ తెలిపారు. రెండు ఆఫీస్ అసిస్టెంట్ పోస్టులకు(రోస్టర్ పాయింట్-2 ఎస్సీ జనరల్), (రోస్టర్ పాయింట్-3 ఓసీ ఉమెన్) రెండు అటెండర్ పోస్టులకు(రోస్టర్ పాయింట్-2 ఎస్సీ జనరల్,(రోస్టర్ పాయింట్-3 ఓసీ ఉమెన్) పోస్టులున్నాయన్నారు. అర్హులైనవారు ఈనెల 14 సాయంత్రం 5గంటలలోపు జిల్లా జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ, జిల్లా కోర్టు ప్రాంగణం చిరునామాకు దరఖాస్తులు పంపాలని సూచించారు.

ఎంసీఏ పరీక్ష ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 6: జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంసీఏ పరీక్ష ఫలితాలను మంగళవారం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సత్యనారాయణ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ద్వితీయ సెమిస్టర్(ఆర్20) విద్యార్థులకు జూలైలో రెగ్యులర్ పరీక్షలు నిర్వహించామన్నారు. ఫలితాల వివరాలకోసం అకడమిక్ సెక్షన్‌ను సంప్రదించాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ అరుణకాంతి, డీసీఈలు లలితకుమారి, విష్ణువర్ధన్, విభాగాధిపతులు కళ్యాణిరాధ, మమత, అజిత, భారతి, భువన విజయ, రామశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

భర్తను చంపిన భార్య



సేవ్యానాయక్ మృతదేహం

గుంతకల్లు టౌన్, ఆగస్టు 6: మండలంలోని గుండాలతండా గ్రామంలో భర్తను భార్య హత్య చేసిన సంఘటన సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన ఎం. సేవ్యానాయక్(40)కు రెండు ఎకరాల పొలం ఉంది. మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని కంది, ఆముదం పంటలు సాగు చేశాడు. సేవ్యానాయక్, అతడి పెద్ద కుమార్తె భాగ్యలక్ష్మి సోమవారం వేరుశనగకాయల మెషీన్ పనికి వెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి తిరిగి వచ్చారు. అదే సమయంలో మృతుడి భార్య లలితమ్మ పొలానికి వెళ్తూ భర్తను భోజనం తీసుకురమ్మని చెప్పింది. సేవ్యానాయక్ క్యారియర్ తీసుకుని పొలం వద్దకు వెళ్లాడు. అక్కడ భార్యభర్తలు గొడవపడ్డారు. దీంతో లలితమ్మ రాయితీసుకుని సేవ్యానాయక్ ముఖం మీద కొట్టింది. అతను కిందపడటంతో తలకు రక్తగాయమైంది, దీంతో భర్త కట్టుకున్న పంచె తీసి గొంతు బిగించి హత్య చేసింది. తర్వాత ఇంటికి వెళ్లింది. దీంతో సేవ్యానాయక్ గురించి ఆమె తమ్ముడు బాగే నాయక్, చెల్లెలి భర్త(మరిది) అడిగారు. సమాధానం సరిగా చెప్పకపోవడంతో గట్టిగా నిలదీశారు. దీంతో తన భర్తను హత్య చేసినట్లు చెప్పింది. వెంటనే ఈ విషయాన్ని మృతుడి కుటుంబ సభ్యులు కసాపురం పోలీసులకు సమాచారం అందించారు. రాత్రి 11 గంటలకు డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి, రూరల్ సీఐ మహేశ్వర్‌రెడ్డి, ఎస్ఐలు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి భార్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. లలితమ్మ అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో వివాహేతర సంబంధం ఉందని, ఇద్దరు కలిసి సేవ్యానాయక్‌ను హత్య చేశారని కుటుంబసభ్యులు ఆరోపించారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నాడు. మృతుడి తమ్ముడు వెంకటేష్‌నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బిరబిరా కృష్ణమ్మ

- జిల్లాకు చేరిన కృష్ణా జలాలు
- మంగళవారం ఉదయం కసాపురం చేరిన నీరు
- రాత్రికి రాగులపాడు పంప్‌హౌస్‌కు...
- ఏప్రిల్ వరకూ నీటి హామీ కోరుతున్న రైతులు





హంద్రీనీవా కాలువలో పారుతున్న కృష్ణా నీరు

ఇన్‌సెట్‌లో చెన్నప్ప కొట్టాల వద్ద సిద్ధంగా ఉన్న వరి నారు

గుంతకల్లు, ఆగస్టు 6: ఆటంకాల మధ్య ఎట్టకేలకు హంద్రీనీవా నీరు మంగళవారం జిల్లాలోకి ప్రవేశించింది. ఉదయం 8 గంటల సమయంలో జిల్లా సరిహద్దులోని బుగ్గసంగాల గ్రామాన్ని దాటిన కృష్ణా నీరు రాగులపాడు పంప్‌హౌస్ వైపు పరుగులు పెట్టింది. శ్రీశైలం డ్యాంలో దాదాపు 20 రోజుల కిందటే పుష్కలంగా నీటి నిల్వ చేరడంతో హంద్రీనీవాలో నీటి ఎత్తిపోతకు ప్రభుత్వ అనుమతి కోసం జల వనరుల శాఖాధికారులు వేచి చూశారు. ఈ నెల 1న పంపింగ్‌కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఒక పంపుతో నీటి ఎత్తిపోతలను ప్రారంభించి, తర్వాత పంపుల సంఖ్యను ఆరుకు పెంచారు. కాగా కర్నూలు జిల్లాలోని బ్రాహ్మణకొట్కూరు వద్ద వంతెన నిర్మాణం కోసం కాల్వను పూడ్చిన కారణంగా ఆటంకం ఏర్పడింది. అలాగే కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం వద్ద కాలువకు గండి పడింది. అప్పటిదాకా కాలువలో ఎగువకు పారిన నీరు మంగళవారం ఉదయం జిల్లా సరిహద్దులను దాటింది. ప్రస్తుతం హంద్రీనీవాలో నీటి ప్రవాహాన్ని తగ్గించినా, నాలుగు రోజుల కిందట ఎత్తిపోసిన నీరు జిల్లాలోకి వచ్చి చేరింది. కాలువలో ప్రస్తుతం దాదాపు వెయ్యి క్యూసెక్కుల నీరు పారు తోంది బుధవారానికి రాగులపాడు పంప్ హౌస్‌కు నీరు చేరే అవకాశం ఉంది.

సాగుకు సిద్ధమవుతున్న రైతులు

హంద్రీనీవాకు మల్యాల వద్ద నీటి ఎత్తిపోతలు ప్రారంభంకాగానే జిల్లాలో కాలువకు ఆనుకుని ఉన్న కమతాల్లో మిర్చి, వరి పంటలను సాగు చేయడానికి రైతులు సిద్ధమయ్యారు. గుంతకల్లు మండలంలోని బుగ్గసంగాల, కసాపురం, జీ కొట్టాల, వజ్రకరూరు మండలంలోని ఛాయాపురం, గడేహోతూరు, చిన్నహోతూరు, విడపనకల్లు మండలంలోని పెంచలపాడు, ఉరవకొండ మండలంలోని శేక్షానుపల్లి, ఉరవకొండ, మోపిడి, తదితర గ్రామాల రైతులు పంటల సాగుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో జూన్, జూలై నెలల్లోనే వరి, మిర్చి నార్లను రైతులు సిద్ధం చేసుకునేవారు. కానీ ఈసారి శ్రీశైలం డ్యాంలో జూలై రెండో వారందాకా తగినంత వరదనీరు వచ్చి చేరకపోవడం తో రైతులు నారు సిద్ధం చేసుకోకుండా వేచిచూశారు. వర్షాలు కూడా పెద్దగా రాకపోవడంతో నారును సిద్ధం చేసుకోవడానికి సంశయించారు.

హామీ ఇవ్వాలి

గత ప్రభుత్వ హయాంలో గడచిన రెండు సీజన్లలో ఫిబ్రవరికే నీరు బంద్ అవుతుందని, దీర్ఘకాలిక పంటలు పెట్టుకోవద్దంటూ జలవనరుల శాఖాధికారులు ఇబ్బంది పెట్టారని రైతులు వాపోతున్నారు. గత సంవత్సరం మిర్చి పంటలు పెట్టిన తర్వాత నీరు డిసెంబరు ఆఖరుకే బంద్ అవుతాయంటూ చావుకబురు చెప్పారన్నారు. 2022 సీజన్‌లో ఫిబ్రవరికే నీరు బంద్ అవుతాయంటూ నోటీసులిచ్చి, దండోరా వేయించి రైతులను ఇబ్బంది పెట్టారు. కానీ తక్కువ మోతాదులో మార్చిదాకా నీటిని పారించారన్నారు. ఈ ఏడాది కాలువకు నీరు రావడంలో ఆలస్యం జరిగిందని, ఈసారైనా ఏప్రిల్ వరకూ నీరు ఇస్తామంటూ హామీ ఇవ్వాలని మిర్చి, కంది రైతులు కోరుతున్నారు.

ఏప్రిల్ వరకూ నీరివ్వాలి



గత రెండేళ్ల మాదిరిగా కాకుండా ఈసారి ఏప్రిల్ వరకూ నీరు ఇస్తామని సాగునీటి అధికారులు హామీ ఇవ్వాలి. పంటలు పెట్టిన తర్వా త విద్యుదుత్పత్తి కారణంగా డ్యాంలో నీరు అడుగంటిందని, డిసెంబరుకే నీరు నిలిచిపోతుందని చెప్పి ఇబ్బంది పెట్టారు. కానీ తర్వాత ఫిబ్రవరి వరకూ వదిలారు. 2022లో కూడా ఇలాగే చేశారు. ఈసారి మాత్రం రైతులకు ఇబ్బందిలేకుండా హామీ ఇవ్వాలి.

- తిరుమల రావు, జీ కొట్టాల రైతు

దొంగతనాలను ఆపాదించడం సరికాదు

- జ్యువెలరీ షాపుల అసోసియేషన్ ఆగ్రహం
- కర్ణాటక పోలీసులను నిలదీసిన వైనం



వన్‌టౌన్ పోలీసు స్టేషన్ వద్ద గుమికూడిన జ్యువెలరీ వ్యాపారులు

ధర్మవరం, ఆగస్టు 6: ఎవరో ఎక్కడో చేసిన దొంగతనాన్ని జ్యువెలరీ షాపుల యాజమాన్యాలకు ఆపాదిస్తూ ఇబ్బంది పెట్టడం సరికాదంటూ ధర్మవరం జ్యువెలరీ షాపుల అసోసియేషన్ నాయకులు మండిపడ్డారు. కొందరు దుండగులు కర్ణాటకలో బంగారం దొంగిలించి ధర్మవరంలో అమ్మారన్నారు. దీంతో అనంతపురం పోలీసులు దొంగలిచ్చిన సమాచారం మేరకు 20 రోజుల క్రితం రికవరీ చేసినప్పటికి మళ్లీ కర్ణాటక పోలీసులు వచ్చి బంగారం ఇవ్వాలంటూ షాపు యజమాని షామీర్‌ను తీసుకెళ్లడంటంపై అసోసియేషన్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ అడ్డుకున్నారు. దీంతో కర్ణాటక పోలీసులు, జ్యువెలరీషాపుల యజమానులు ధర్మవరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు చేరడంతో ఉద్రిక్తత నెలకొంది. అసోసియేషన్ అధ్యక్షుడు ఖలీల్ రహిమాన్ మాట్లాడుతూ పట్టణంలోని షామీర్‌అనే స్వర్ణకార వ్యాపారిని స్థానిక పోలీసుల సహకారంతో చిత్రదుర్గ పోలీసులు తీసుకెళ్లడం సరైన పద్ధతి కాదన్నారు. గత నెలలోనే అనంతపురం పోలీసులకు కొనుగోలు చేసిన బంగారాన్ని ఇచ్చేశారన్నారు. మళ్లీ చిత్రదుర్గ పోలీసులు వచ్చి అదే బంగారాన్ని ఇవ్వాలని వ్యాపారిని ఇబ్బంది పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. మీ తప్పులను కప్పి పుచ్చుకోవడానికి బంగారుషాపు దుకాణాలపై అభాండాలు మోపడం పద్ధతికాదన్నారు. షామీర్‌ను వదిలేవరకు సంఘం తరపున చట్టపరంగా పోరాడుతామన్నారు.

తొణికిసలాడుతున్న తుంగభద్ర



నిండుకుండలా తుంగభద్ర జలాశయం

బొమ్మనహాళ్, ఆగస్టు 6: తుంగభద్ర జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 102.335 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. మంగళవారం సాయంత్రానికి 84,696 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. 12 క్రస్ట్‌గేట్లు రెండు అడుగులు మేర ఎత్తి 35,592 క్యూసెక్కుల నీటిని దిగువకు వదలగా 19,635 క్యూసెక్కుల నీరు కాలువలకు వెళుతున్నట్లు తెలిపారు. మొత్తం 55,227 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. హెచ్చెల్సీ ఆంధ్రా సరిహద్దులోని 105 కి.మీ. వద్ద 1300 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

అంతా ఆన్‌లైన్‌లోనే..

- ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పని చేయండి
- ఎవరి స్థాయిలో వారికి పట్టు ఉండాలి
- ఎంఈఓ, డిప్యూటీ డీఈఓలదే బాధ్యత
- విద్యాశాఖ ఆర్‌జేడీ శామ్యూల్

అనంతపురం విద్య, ఆగస్టు 6: ఉపాధ్యాయుల పని సర్దుబాటు అంతా ఆన్‌లైన్‌లో జరుగుతుందని పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ శామ్యూల్ పేర్కొన్నారు. ఎలాంటి ప్రలోభాలకు తావులేకుండా ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పని చేయాలని ఆదేశించారు. అన్నింటికీ ఎంఈఓ, డిప్యూటీ డీఈఓలదే పూర్తి బాధ్యతని హెచ్చరించారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓ-1, 2లతో ఆర్‌జేడీ మంగళవారం నగర శివారులోని ఆర్టీటీ ఆడిటోరియంలో సమీక్ష నిర్వహించారు. జిల్లాకు తొలిసారి వచ్చిన ఆయనకు డీఈఓ వరలక్ష్మి, ఇతర డిప్యూటీ డీఈఓలు, ఏడీలు, ఎంఈఓలు ఘన స్వాగతం పలికారు. తర్వాత సమీక్షలో ఆయన మాట్లాడుతూ విద్యాశాఖపై ప్రిన్సిపల్ సెక్రెటరీ కోన శశిధర్, కమిషనర్ విజయరామరాజు చాలా క్లారిటీతో ఉన్నారన్నారు. మండలంపై ఎంఈఓలు, డివిజన్లపై డిప్యూటీ డీఈఓలు, జిల్లాపై డీఈఓ పూర్తి స్థాయిలో అవగాహనలో ఉండాలన్నారు. పత్రికల్లో ఏ చిన్న వార్త వచ్చినా నేరుగా కమిషనర్‌కు వెళ్తుందని, అక్కడి నుంచి అడిగే వరకూ మీరు నిర్లక్ష్యంగా ఉండరాదన్నారు. పై నుంచి అడిగినటప్పుడు తెలియదు, కనుక్కొని చెబుతా అంటూ సమాధానం చెబితే కుదరదని హెచ్చరించారు. ఆగస్టు 15 తర్వాత విద్యాశాఖ మంత్రి లోకేశ్, సెక్రెటరీ, కమిషనర్ తనిఖీలకు వచ్చే అవకాశం ఉందన్నారు. చాలా మంది ఎంఈఓలకు స్కూళ్ల వివరాలు కూడా సరిగ్గా తెలియదన్నారు. ప్రధానం గవర్నమెంట్, ఎయిడెడ్, ప్రైవేట్ ఈ మూడు కేటగిరీ స్కూళ్ల వివరాలను పక్కాగా సేకరించాలన్నారు. నిత్యం లెసన్ ప్లాన్‌పై హెచ్‌ఎం సైన్ చేసి పర్యవేక్షించాలన్నారు. తర్వాత జరిగే ఉపాధ్యాయుల పని సర్దుబాటు అంతా ఆన్‌లైన్‌లోనే పారదర్శకంగా జరుగుతుందన్నారు. ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా, పక్కాగా సాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్కూల్ మేనేజ్‌మెంట్ ఎన్నికలు సజావుగా సాగేలా చూడాలని ఆయన డిఈఓలు, డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలను ఆదేశించారు. కార్యక్రమంలో డీఈఓ వరలక్ష్మి, ఏపీసీ నాగరాజు, ఏసీ గోవింద్ నాయక్, ఏడీలు క్రిష్టయ్య, నాగరాజు, డిప్యూటీ డీఈఓలు రంగస్వామి, శ్రీనివాసులు, శ్రీదేవి, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌జేడీ శామ్యూల్, వేదికపై డీఈఓ వరలక్ష్మి, ఇతర అధికారులు

సెప్టెంబరు నుంచి భారత పశుగణన సర్వే

అనంతపురం అర్బన్, ఆగస్టు 6: వచ్చే నెల(సెప్టెంబరు) 1 నుంచి డిసెంబరు నెలాఖరుదాకా 21వ భారత పశుగణన సర్వే నిర్వహించనున్నట్లు పశుసంవర్ధక శాఖ జేడీ సుబ్రహ్మణ్యం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని గృహాలు, సంస్థల వద్ద ఉన్న అన్ని జాతుల పశువుల వివరాలను ప్రభుత్వం తయారు చేసిన ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలన్నారు. పశుగణన కోసం జిల్లా వ్యాప్తంగా 189 మంది ఎన్యుమరేటర్లు, 53 మంది సూపర్ వైజర్లను పశుసంవర్ధక శాఖ అధికారులు, సిబ్బంది నుంచి ఎంపిక చేసినట్లు వెల్లడించారు. బుధవారం అనంతపురం డివిజన్ కార్యాలయం, ఈనెల 8న ఉరవకొండ డివిజన్ కార్యాలయంలో ఎంపిక చేసిన సిబ్బందికి శిక్షణ ఉంటుందన్నారు.

నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం విద్య, ఆగస్టు 6: నవోదయ విద్యాలయ సమితి 2025-26 ఏడాదికి సంబంధించి 6వ తరగతిలో ప్రవేశాలకు దరకాస్తులు చేసుకోవాలని డీఈఓ వరలక్ష్మి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 3వ, 4వ తరగతి ఉత్తీర్ణత సాధించడంతోపాటు, 2024-25లో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు, జిల్లాలో నివాసం ఉంటున్న విద్యార్థులు, 2013 మే 1 నుంచి 2015 జూలై 31 మధ్య జన్మించిన విద్యార్థులు అర్హులన్నారు. దరఖాస్తు చేయడానికి అక్టోబరు 16 చివరి తేదీ అని తెలిపారు. వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. నవోదయ. జీవోవి.ఇన్‌ను సంప్రదించాలన్నారు.

ప్రజలను ఇబ్బంది పెట్టొద్దు

- తహసీల్దార్ హరికుమార్

అనంతపురం రూరల్, ఆగస్టు 6: సమస్యల పరిష్కారం కోసం కార్యాలయానికి వచ్చే ప్రజలను ఇబ్బంది పెట్టవద్దని తహసీల్దార్ హరికుమార్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, సచివాలయ వీఆర్వోలు, సర్వేయర్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సర్టిఫికెట్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరగకుండా చూడాలన్నారు. దరఖాస్తులు ఏవీ పెండింగ్‌లో ఉండటానికి వీలులేదన్నారు. సకాలంలో సర్వే నిర్వహించి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ పునీత్, ఈడీటీ శ్రీరాములు, ఆర్ఐ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

కార్డుదారుల నుంచి ఫిర్యాదులు రాకూడదు

రేషన్ పంపిణీపై కార్డుదారుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకూడదని తహసీల్దార్ హరికుమార్ అన్నారు. ఎండీయూ ఆపరేటర్ల ద్వారా జరుగుతున్న రేషన్‌పంపిణీని మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 17వతేదీ వరకు నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తారన్నారు. కార్డుదారుల నుంచి ఫిర్యాదులు వస్తే చౌకధాన్యపు డీలర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

భూసమస్యల పరిష్కారంపై దృష్టి సారించండి

జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్



ముక్తాపురంలో వివాదాస్పద భూమిని పరిశీలిస్తున్న జేసీ

ధర్మవరంరూరల్ (కనగానపల్లి), ఆగస్టు 6: భూసమస్యలపై రైతులు ఫిర్యాదుచేసిన వెంటనే స్పందించి తక్షణ పరిష్కారం చూపాలని శ్రీసత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కనగానపల్లి మండలంలోని ముక్తాపురం రెవెన్యూ గ్రామంలో మంగళవారం మామిళ్లపల్లి, ముక్తాపురం గ్రామాల్లోని వివాదస్పద భూములకు సంబంధించి జాయింట్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన ఆ భూములను పరిశీలించారు. ముక్తాపురం ఎస్సీకాలనీకి సంబంధించి ఇళ్లపట్టాలు కేటాయించిన సర్వేనెంబర్ 224-4లెటర్ భూమిని సిబ్బందితో కలిసి పరిశీలించారు. అదేవిధంగా మామిళ్లపల్లికి సంబంధించి 392-4లో ఫిర్యాదు అందడంతో ఆ భూములను పరిశీలించారు. రైతులకు తప్పక న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి, తహసీల్దార్ రమాదేవి, ఆర్ఐ సరళ, వీఆర్ఓ చెన్నకేశవులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి రక్తదానం చేయాలి

జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ సుదర్శన రావు

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 6: ఆరోగ్యవంతులు ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలని జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు సూచించారు. మంగళవారం జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి రక్తనిధి కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మమత అధ్యక్షతన నిర్వహించిన శిబిరానికి ఇన్‌చార్జ్ వీసీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన విద్యార్థులందరూ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి రక్తనిధి కేంద్రానికి వెళ్లి మూడు నెలలకోసారి స్వచ్ఛందంగా రక్తాన్ని ఇవ్వాలన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ అరుణకాంతి, ప్రొఫెసర్ ఆనందరావు, విభాగాధిపతులు మారాల రామశేఖర్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ జోజిరెడ్డి, డీఈ శ్యామ్‌బాబు, డాక్టర్ నీరజ, రక్తనిధి కేంద్రం రమణారెడ్డి పాల్గొన్నారు.

'ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి'

గార్లదిన్నె, ఆగస్టు 6: ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమ అధికారి డాక్టర్ యుగంధర్ సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో జరుగుతున్న ఆశా డే కార్యక్రమాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు గౌతమి, హనీషా, సీహెచ్‌ఓ లోకనాథ్ పాల్గొన్నారు.

రేపు పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు

గార్లదిన్నె, ఆగస్టు 6: స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు గురువారం నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారులు తారా చంద్రానాయక్, వెంకటరమణ నాయక్ తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం 3:30 గంటలకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

గుజరాత్‌పై కేరళ జట్టు గెలుపు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 6: జాతీయ ఫుట్‌బాల్ పోటీల్లో కేరళ విజయపరంపర కొనసాగిస్తోంది. మంగళవారం స్థానిక అనంత క్రీడాగ్రామంలో గుజరాత్‌పై కేరళ రెండో విజయం నమోదు చేసింది. అరుణాచల్ ప్రదేశ్, తమిళనాడు మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఆంధ్రప్రదేశ్, కేరళ జట్లు పాయింట్లలో ముందంజలో ఉన్నాయి. కార్యక్రమంలో డీఎస్‌డీఓ షఫీ, పీవీకేకే ప్రిన్సిపాల్ సుబ్బారావు, కేవీ రమణ, హనుమంతరెడ్డి, రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వేణుగోపాల్ పాల్గొన్నారు

హనుమాన్ దర్శన్‌కు కదిలిన ఆర్టీసీ బస్సులు

అనంతపురం కల్చరల్, ఆగస్టు 6: శ్రావణమాసాన్ని పురస్కరించుకుని ఏపీఎస్ ఆర్టీసీ అనంతపురం రీజియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హనుమాన్ దర్శన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం బస్సు సర్వీసులు ప్రారంభమయ్యాయి. తొలి మంగళవారం 41 మంది ప్రయాణికులతో అనంతపురం డిపో నుంచి బస్సు మురుడి, నేమకల్లు, కసాపురం ఆలయాల సందర్శనకోసం బయలుదేరి వెళ్లింది. అనంతపురం డీఎం నాగభూపాల్ టెంకాయి కొట్టి బస్సును ప్రారంభించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డిపో మేనేజర్ వినయ్, బస్టాండు మేనేజర్ కేఎన్ మూర్తి, పిసికె స్వామి, ప్రయాణికులు పాల్గొన్నారు.

దేశభక్తి పెంపొందేలా 'హర్‌ఘర్ తిరంగా'



మాట్లాడుతున్న సందిరెడ్డి శ్రీనివాసులు

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 6: పౌరుల్లో దేశభక్తిని పెంపొందేలా ప్రధాని నరేంద్రమోదీ 'హర్‌ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని తలపెట్టారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో హర్‌ఘర్ తిరంగా సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సందిరెడ్డి శ్రీనివాసులు, నాయకులు కాపు రామచంద్రారెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గోపిశ్రీనివాస్ హాజరై ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగిరేలా తీసుకోవాల్సిన ప్రణాళికలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, అశోక్‌రెడ్డి, తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

చీనీకాయలు టన్ను రూ.19వేలు

అనంతపురంరూరల్, ఆగస్టు 6: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.19,200లు, కనిష్ఠంగా రూ.4వేలు, సరాసరి రూ.12వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 770టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

పంటల సాగు, తెగుళ్లపై అవగాహన పెంచుకోండి

రైతుసేవా కేంద్రం సిబ్బందికి జిల్లా వ్యవసాయాధికారి సూచన



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అర్బన్, ఆగస్టు 6: వివిధ రకాల పంటల సాగు, పంటలకు ఆశించి తెగుళ్లపై మరింత అవగాహన పెంచుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ రైతు సేవా కేంద్రం సిబ్బందికి సూచించారు. మంగళవారం స్థానిక రైతు శిక్షణ కేంద్రంలో రైతు సేవా కేంద్రం సిబ్బందికి పలు అంశాలపై శిక్షణనిచ్చారు. శాస్త్రవేత్తలు రమేష్ నాయక్, మల్లీశ్వరి, కిశోర్‌రెడ్డి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వరి, వేరుశనగ, కంది, పత్తి, ఆముదం తదితర పంటలకు ఆశించే తెగుళ్ల గుర్తింపు, నివారణ చర్యలపై క్షుణ్ణంగా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ మాట్లాడుతూ జిల్లాలోని పలువురు రైతు సేవా కేంద్రం సిబ్బందికి ఏయే పంటల్లో ఏ రకాల తెగుళ్లసోకుతాయి..? వాటి నివారణ కోసం ఏ మందులు పిచికారి చేయాలన్న విషయాలపై పరిజ్ఞానం లేదన్నారు. వ్యవసాయంపై సంపూర్ణ అవగాహన పెంచుకొని, క్షేత్రస్థాయిలో రైతులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో, అనంతపురం ఏడీఏ రవి, శిక్షణా కేంద్రం అధికారి మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

ఆర్జేడీకి వినతుల వెల్లువ



ఆర్జేడీని కలసిన ఎస్టీయూ నాయకులు

అనంతపురం విద్య, ఆగస్టు 6: పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ శామ్యూల్‌కు పలు సమస్యలపై వినతులు వెల్లువెత్తాయి. మంగళవారం జిల్లాకు వచ్చిన ఆయనను పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రైవేట్ స్కూళ్ల కరస్పాండెంట్లు పంగల్ రోడ్డులోని ఆర్టీటీ ఆడిటోరియంలో కలిశారు. స్కూళ్లలో క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

జిల్లాలోనే సర్దుబాటు చేయాలి: ఎస్టీయూ

ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి రామాంజినేయులు ఇతర నాయకులు సూర్యుడు, పణిభూషణ్, సురేష్‌బాబు, కృష్ణమోహన్, వాణి, కిషోర్, మురళీ, రాజన్న, రామకృష్ణ మరికొందరు ఆర్‌జేడీని కలిశారు. జిల్లాలో స్థాయిలోనే టీచర్ల సర్దుబాటు చేయాలని కోరారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఇంగ్లీష్ టీచర్ల ఉద్యోగోన్నతులు తక్షణమే చేయాలని కోరారు. అపరిష్కృతంగా విద్యారంగసమస్యలను పరిష్కరించాలని సూచించారు.

117 రద్దు చేయాలి : యూటీఎఫ్

విద్యాశాఖకు శాపంగామారిన 117 జీవోను రద్దు చేయాలని యూటీఎఫ్ నాయకులు ఆర్‌జేడీని కోరారు. ఆ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి లింగమయ్య, గౌరవాధ్యక్షులు రమణయ్య, నాయకులు సుబ్బరాయుడు, నారాయణ, మల్లికార్జున, పవన్ మరికొందరు ఆర్‌జేడీని కలిశారు. వారు మాట్లాడుతూ ప్రీ ప్రైమరీతోపాటు, ఒకటి నుంచి 5వ తరగతి వరకూ ఒకే పాఠశాల ఉంచాలన్నారు. ప్రతి తరగతి గదికి ఒకే టీచర్‌ను నియమించాలని, అన్ని స్కూళ్లలో ఒకే తరహా సిలబస్ ఉంచాలన్నారు.

● ఏపీపీయూఎస్‌ఎంఏ(అపుస్మా) సంఘం జిల్లా అధ్యక్షుడు పుల్లారెడ్డి, కోశాధికారి ఇక్బాల్, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ సుబ్బారెడ్డి, స్టేట్ కన్వీనర్ నాగరాజు, ఇతర నాయకులు శ్రీనివాస్‌రెడ్డి,రవీందర్‌రెడ్డి, శశిభూషణ్, లక్ష్మణ్, జలీల్, నారాయణరెడ్డి, రామచంద్రారెడ్డి, రామూర్తి, మధుసూదన్‌రెడ్డి,రఘునాథ్‌రావు ఆర్జేడీని కలిశారు.

హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

జీవో 77 రద్దు చేయాలి

ధర్నాలో ఏఐఎస్ఎఫ్ నాయకులు



నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

అనంతపురం విద్య, ఆగస్టు 6: ప్రభుత్వ హాస్టళ్లలో ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుళ్లాయిస్వామి, జిల్లా అధ్యక్షుడు రమణయ్య మాట్లాడుతూ జిల్లాలో వందకు పైగా హాస్టళ్లు ఉంటే 70 శాతం హాస్టళ్లు పాతపబడ్డాయన్నారు. కూలడానికి సిద్ధంగా ఉన్న హాస్టళ్ల స్థానంలో కొత్త భవనాల నిర్మాణం చేపట్టాల్సి ఉందన్నారు. పలు హాస్టళ్లలో టాయిలెట్లు, వాష్ రూమ్స్ కూడా లేని దుస్థితి నెలకొందన్నారు. గుత్తి పట్టణంలోని హాస్టల్‌లో 276 మంది విద్యార్థులుంటే కేవలం ఆరు గదులున్నాయన్నారు. జిల్లాలో చాలా చోట్ల ఇలాంటి పరిస్థితే ఉందన్నారు. గత 8 నెలలుగా పెండింగ్‌లో ఉంచిన మెస్, కాస్మోటిక్ చార్జీలను వెంటనే చెల్లించాలన్నారు. హాస్టళ్లలో పనిచేస్తున్న ట్యూటర్లకు గత ప్రభుత్వం జీతాలు కూడా చెల్లించలేదన్నారు. కొత్త ప్రభుత్వం వెంటనే చెల్లింపు చేయాలన్నారు. బోధన, బోధనేతర పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, విద్యార్థుల ఉన్నత చదువులకు శాపంగా మారిన జీవో 77 రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం కోశాధికారి హనుమంతు, జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహయాదవ్, వంశీ, నాయకులు ఉమామహేష్, వినోద్, చందు, నవీన్, హరున్, సిద్దు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

అవగాహన ర్యాలీలో వైద్యాధికారులు



ర్యాలీని ప్రారంభిస్తున్న వైద్యాధికారులు

అనంతపురం టౌన్, ఆగస్టు 6: పుట్టిన వెంటనే తల్లిపాలు తాపడం బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని వైద్యులు సూచించారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ జరిగింది. వైద్యశాఖ జిల్లా కార్యాలయం వద్ద డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి తల్లి కాన్పు అయిన గంటలోపే బిడ్డకు ముర్రిపాలు పట్టించాలన్నారు. ముర్రిపాలు బిడ్డకు వ్యాధినిరోధకశక్తిని పెంచడంతోపాటు బిడ్డ అన్ని దశల్లోనూ ఆరోగ్యంగా ఉండేందుకు తోడ్పడతాయన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎంఓ డాక్టర్ హేమలత, చిన్నపిల్లల డాక్టర్ రవికుమార్, డీఐఓ డాక్టర్ యుగంధర్, డాక్టర్ రవిశంకర్, డాక్టర్ పుష్పలత, డెమో త్యాగరాజు, గంగాధర్ పాల్గొన్నారు.

శింగనమల: బిడ్డకు తల్లిపాలు శ్రేయస్కరమని తహసీల్దార్ బ్రహ్మయ్య ఎంపీడీఓ వెంకటరమణ సూచించారు. మంగళవారం శింగనమల ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ ఉమాశంకరమ్మ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. గ్రామ పురవీధుల్లో తల్లిపాల ఆవశ్యకత తెలుపుతూ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో సూపర్‌వైజర్లు ధనలక్ష్మి, ఉమాదేవి, వాణిశ్రీ, జ్యోతి కౌలస్య అన్నపూర్ణ, నాగమణి పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం బోల్తా... ఒకరికి గాయాలు

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 6: మండలంలోని చందమూరు గ్రామ సమీపంలో మంగళవారం ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తాపడిన ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. పెనుకొండ మండలం గుట్టూరు గ్రామానికి చెందిన ఇనాయ్‌బాషా, మలిక ధర్మవరానికి స్కూటీలో బయలుదేరారు. చెన్నేకొత్తపల్లి మండలం చందమూరు గ్రామ సమీపంలో స్కూటీ అదుపు తప్పి బోల్తాపడింది. ప్రమాదంలో మలిక తలకు తీవ్రగాయాలు కాగా ఇనాయ్‌బాషా స్వల్పంగా గాయపడ్డాడు. స్థానికులు వారిని ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్సలు అనంతరం మెరుగైన వైద్య చికిత్సల కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సరుకుల పంపిణీ

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 6: శ్రీవాణి డిగ్రీ అండ్ పీజీ కళాశాలల ఆధ్వర్యంలో మంగళవారం అనాథ ఆశ్రమానికి నిత్యావసర సరుకులను పంపిణీచేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వనజమ్మ ఆశ్రమ నిర్వాహకులకు నిత్యావసరాలను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుధీర్‌రెడ్డి, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ అంజి, నందకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

'పాలక మండలిని ఏర్పాటు చేయాలి'

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 6: కూటమి ప్రభుత్వంలో నూతన పాలక మండలిని ఏర్పాటుచేయాలని ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ అనితను టీఎన్ఎస్ఎఫ్ నాయకులు కోరారు. మంగళవారం మర్యాదపూర్వకంగా వీసీని కలిసి టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరశురామ్, మధు విద్యార్థుల సమస్యలపై చర్చించారు.

10న జిల్లా హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 6: జిల్లా హ్యాండ్‌బాల్ జూనియర్ బాల, బాలికల జట్ల ఎంపిక పోటీలు ఈనెల 10వతేదీన ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించనున్నట్లు ఆ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రమణారెడ్డి, రఫీయుద్దీన్ తెలిపారు. ఆసక్తి, అర్హతగల క్రీడాకారులు జనన ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు, పదోతరగతి మార్కుల జాబితా, క్రీడాసామగ్రి, యూనిఫాంతో హాజరుకావాలన్నారు. ఎంపికైన జట్లు కదిరిలో ఈనెల 17వతేదీ నుంచి నిర్వహించే 46వ ఏపీ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. వివరాలకు సెల్ నంబర్లు 9949942494, 8639138569లను సంప్రదించాలని కోరారు.

'అధికారులూ.. న్యాయం చేయండి'

అనంతపురం రూరల్, ఆగస్టు 6: ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని అంగన్‌వాడీలు కోరారు. మండలంలోని ఉప్పరపల్లి గ్రామ సర్వే నెంబరు 107-2లో 2011లో అంగన్‌వాడీలకు ఇళ్లస్థలాలు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మంగళవారం తమకు కేటాయించిన స్థలంలో కొందరు అంగన్‌వాడీలు కొట్టాలు వేసుకునేందుకు వెళ్లారు. అయితే భాస్కర్, లక్ష్మీదేవి దంపతులు భూమి తమదంటూ వారితో వాగ్వాదానికి దిగారు. దీంతో తమకు న్యాయం చేయాలని అంగన్‌వాడీలు నక్షత్ర, ఆదెమ్మ, లక్ష్మీనరసమ్మ, వరలక్ష్మి, యశోదా కోరారు.

మందులు వాడితే కుష్టు నయం: జాయింట్ డైరెక్టర్

అనంతపురం టౌన్, ఆగస్టు 6: మందులు సక్రమంగా వాడితే కుష్టు నయమవుతుందని వైద్యఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ దేవసాగర్ సూచించారు. మంగళవారం ఆయన జిల్లాకు వచ్చారు. కుష్టువ్యాధి సర్వేను పరిశీలించారు. అనంతరం జిల్లా వైద్యశాఖ కార్యాలయం, మెడికల్ కళాశాలలో వైద్యాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటిని సర్వే చేసి కుష్టు అనుమానిత లక్షణాలు ఉన్నవారిని గుర్తించాలన్నారు. ఆదిలోనే లక్షణాలు ఉన్నవారిని గుర్తించి పరీక్షలు చేయించాలన్నారు. కుష్టులక్షణాలు ఉన్నట్లు తేలితే మందులు తీసుకునేలా చూడాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, క్షయనివారణ విభాగ అధిపతి డాక్టర్ అనుపమ, డాక్టర్ గంగాధరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'హద్దులు ఏర్పాటు చేయించండి'



పరిటాల సునీతకు వినతి పత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

అనంతపురం రూరల్, ఆగస్టు 6: మండలంలోని కురుగుంట గ్రామంలో ఎంఆర్‌పీఎస్ కార్యకర్తలకు ఇచ్చిన పట్టాలకు హద్దులు ఏర్పాటు చేయించాలని రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బీసీ ఆర్ దాస్ కోరారు. మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే పరిటాల సునీతను జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో కలసి వినతిపత్రం ఇచ్చారు. ఇందుకు ఆమె సానుకూలంగా స్పందించారని బీసీఆర్ దాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లుట్ల రామకృష్ణ, రాము, శివ, చిన్న, రామాంజి, సుంకన్న, సూరి తదితరులు పాల్గొన్నారు.

దుష్ప్రచారాలు మానుకోండి: ఎమ్మెల్యే బండారు

శింగనమల, ఆగస్టు 6: ప్రభుత్వంపై వైసీపీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాన్ని మానాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో హితవుపలికారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారన్నారు. అయితే వైసీపీ నేతలు సోషల్ మీడియాలో, సొంత పత్రికలో అవాస్తవ కథనాలు ప్రచురించడం పద్ధతికాదన్నారు. ఎన్ని జిమ్మిక్కులు చేసినా వైసీపీ నాయకులను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరన్నారు.

ఇద్దరు మహిళల బలవన్మరణం

అనంతపురం క్రైం, ఆగస్టు 6: నగర పరిధిలో ఇద్దరు మహిళలు బలవన్మరణానికి పాల్పడ్డారు. జానకిరామ్‌నగర్‌లో బాలకృష్ణ, ఇంద్రజ నివాసముంటున్నారు. ఇంద్రజ(28) కియాలో పనిచేస్తుంది. బాలకృష్ణ బేల్దారిగా పనిచేస్తుంటాడు. సోమవారం వీరి మధ్య వాగ్వాదం జరిగింది. బాలకృష్ణ పనికి వెళ్లి తిరిగి వచ్చేసరికి ఇంద్రజ ఆత్మహత్య చేసుకుంది. కాగా ఈ ఘటనపై కడుపునొప్పి తాళలేక ఆత్మహత్య చేసుకుందని ఇంద్రజ తల్లి సుశీలమ్మ త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు మరింత లోతుగా విచారణ చేయాలని భావిస్తున్నట్లు సమాచారం.

మరో మహిళ... కళ్యాణదుర్గం రోడ్డుకు చెందిన జ్యోతి(35) మంగళవారం ఆత్మహత్య చేసుకుంది. సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని మృతి చెందింది. ఆమె ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. అనంతపురం రూరల్ పోలీసులు విచారణ చేస్తున్నారు.

గ్రానైట్ కటింగ్ మిషన్ తగిలి వ్యక్తి మృతి

నగరంలోని జనశక్తినగర్‌కు చెందిన దూదేకుల ఫక్రుద్దీన్(63) గ్రానైట్ కటింగ్ మిషన్ తగలి మృతిచెందాడు. ఫక్రుద్దీన్ కట్టెల వ్యాపారం చేసేవాడు. మంగళవారం గ్రానైట్ కటింగ్ మిషన్‌తో కట్టెలు కట్ చేస్తుండగా ప్రమాదవశాత్తు మిషన్ అతనికి తగిలింది. కాలికి తీవ్ర రక్తస్రావం కావడంతో కుటుంబ సభ్యులు ఆటోలో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుమారుడు అబ్దుల్లా ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేతనాల కోసం కార్మికుల ఆందోళన

అనంతపురం టౌన్, ఆగస్టు 6: వేతనాలు చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ వైద్యకళాశాలలో పారిశుధ్య కార్మికులు మంగళవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు మాట్లాడుతూ జీఓ ప్రకారం వేతనం నెలకు రూ16వేలు ఇవ్వాలని ఉన్నా ఇవ్వడంలేదన్నారు. ప్రస్తుతం నాలుగు నెలల జీతాలు ఇవ్వలేదన్నారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోయారు. అనంతరం ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ప్రకాష్, వెంకటేష్, మనోహర్, భార్గవి పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా శ్రావణ మంగళవార పూజలు

అనంతపురం కల్చరల్, ఆగస్టు 6: శ్రావణమాసం మొదటి మంగళవారాన్ని పురస్కరించుకుని మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వరకోదండరామాలయంలో పూజాది కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామికి ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు చేశారు. మహామంగళహారతి నివేదనానంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమేష్‌బాబు, అనువంశీకుడు హోసూరు రామసుబ్రహ్మణ్యం, పరమేష్, ప్రధానార్చకుడు నరసింహశాస్త్రి, కిశోర్, హర్ష పాల్గొన్నారు.

పంపనూరులో...



ఆత్మకూరు: పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో మంగళవారం శ్రావణమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకాలు అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణ అధికారి అక్కిరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

శింగనమల: మండలంలో చిన్నజలాలపురం గ్రామంలో మాధవరాజుల స్వామి విగ్రహ ప్రతిష్ఠ మంగళవారం ఘనంగా జరిగింది. విగ్రహ ప్రతిష్ఠకు రూ.40 వేలు విరాళాన్ని రాష్ట్ర తెలుగుయువత అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు అందజేశారు. విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా నాలుగురోజులపాటు ప్రత్యేక పూజలు జరగనున్నాయి. టీడీపీ నాయకులు దాసరి గంగాధర్, కుళ్లాయప్ప, బండి పరశురాం, నరేష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతం



అనంతపురం కల్చరల్, ఆగస్టు 6: సత్యనారాయణ స్వామి వ్రతాన్ని మంగళవారం అశోక్ నగర్‌లోని రమా సమేత సత్యనారాయణస్వామి దేవాలయంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివార్ల మూలవిరాట్లకు ఫలపంచామృతాభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు చేసి విశేష పూజాది కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో స్వామివారి అష్టాక్షరి హోమం నిర్వహించి, స్వామివారికి మహామంగళహారతి నివేదనానంతరం భక్తులకు తీర్థప్రసాద, అన్నదాన వినియోగం చేశారు. సాయంత్రం ఆలయం వెలుపల స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించారు.

రిజిస్ట్రేషన్ చేయించుకోండి

చెన్నేకొత్తపల్లి/రామగిరి, ఆగస్టు 6: డ్రిప్, స్ప్రింక్లర్లు కావాల్సిన రైతులు రైతుసేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఎంపీఏఓ రవిశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాలకు సంబంధించి బోరు బావులు కలిగి నీటి వసతి ఉన్న రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందుకు 1బీ, ఎఫ్ఎంఎఫ్‌బీ స్కెచ్, చెక్ బంది సర్టిఫికెట్, ఆధార్, బ్యాంకు పాసుపుస్తకం జిరాక్స్, బోరువెల్ కరెంటుబిల్లు డాక్యుమెంట్లతో రైతు సేవా కేంద్రాలకు వెళ్లి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వివరాల కోసం 7995010085, 9704439518 నెంబర్లను సంప్రదించాలన్నారు.

బాల్య వివాహం నేరం: పీడీ

రాప్తాడు, ఆగస్టు 6: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పంగల్ రోడ్డు సమీపంలోని ఆదర్శ పాఠశాలలో బాల్య వివాహాలు, పోక్సో చట్టంపై పోస్టర్లు విడుదల చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ బాలికలు ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు. 18 సంవత్సరాలు పూర్తయ్యే వరకు వివాహం చేసుకోరాదన్నారు. కార్యక్రమంలో డీసీపీయూ యూనిట్ లీగల్‌సెల్ అధికారి సంధ్యారాణి, ప్రొటెక్షన్ అధికారి చంద్రకళ, దిశసెల్ విభాగం ఉమాదేవి, ఓఎస్సీ మేనేజర్ శాంతి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ పద్మజాదేవి తదితరులు పాల్గొన్నారు.

'ఉచిత శిక్షణ ఇవ్వాలి'

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 6: డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వాలని ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం జిల్లా ఎస్సీ వెల్ఫేర్ కార్యాలయం ముందు నిరసన చేశారు. డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసినా ఎస్సీ వెల్ఫేర్ కార్యాలయ అధికారులు ఉచిత శిక్షణ తరగతులను ప్రారంభించడంలేదని మండిపడ్డారు. వెంటనే ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మందల శాంతకుమార్, మధుప్రసాద్, ఎమ్మార్పీఎస్ నాయకులు నారాయణస్వామి, రాజశేఖర్, వెంకీ, రామాంజినేయులు పాల్గొన్నారు.

అమరులకు నివాళి

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 6: దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో చుండూరు అమరులకు అంబేడ్కర్ విగ్రహంవద్ద మంగళవారం నివాళులర్పించారు. మాలమహానాడు ఓబులేసు, ఎస్సీ, ఎస్టీ జేఏసీ సాకే హరి, సమతా సైనిక్ దళం సుగమంచి శ్రీనివాసులు మాట్లాడుతూ కారంచేడు, చుండూరు ఘటనల్లో దోషులను శిక్షించాలన్నారు. కార్యక్రమంలో గంగాధరప్ప, నరేష్, ఓబుళరాజు, రామాంజినేయులు, వినయ్, ఈశ్వరయ్య, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

టీసీఎస్‌లో విద్యార్థికి ఉద్యోగం

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 6: టీసీఎస్‌లో ఉద్యోగానికి అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థిని నస్రీన్ ఎంపికైంది. ఈ మేరకు మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి విద్యార్థికి అపాయింట్‌మెంట్ లెటర్‌ను అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకుడు సుధాకర్‌రెడ్డి, కరుణకుమార్ తదితరులు పాల్గొన్నారు.



నస్రీన్‌కు అపాయింట్‌మెంట్ లెటర్‌ను అందజేస్తున్న ప్రిన్సిపాల్

ఇసుక ట్రాక్టర్లు సీజ్

గుమ్మఘట్ట, ఆగస్టు 6: మండల కేంద్రంలో వేదావతి హగరి నుంచి సోమవారం అర్ధరాత్రి కర్ణాటకకు అక్రమంగా ఇసుకను రవాణాచేస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. గుమ్మఘట్టకు చెందిన శివన్న, శివ అనే వ్యక్తుల ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు చెప్పారు.

రేషన్ బియ్యం పంపిణీ చేయడం లేదని ఫిర్యాదు

ఉరవకొండ, ఆగస్టు 6: రేషన్ బియ్యం పంపిణీ చేయడం లేదంటూ పట్టణంలోని 20, 7వ రేషన్ దుకాణాల పరిధిలోని లబ్ధిదారులు తహసీల్దార్ మహబూబ్‌బాషాకు ఫిర్యాదు చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం లో మంగళవారం వారు తహసీల్దార్‌ను కలిసి మాట్లాడా రు. రేషన్ బియ్యం పంపణీ చేసే ఎండీయూ వాహనాల వద్దకు వెళితే బియ్యం వెయ్యడం లేదని వాపోయారు. రేషన్ షాపులకు వెళ్లి డీలర్లను అడిగితే స్టాక్ అయిపోయిందని స మాధానం చెబుతున్నారన్నారు. తమకు సక్రమంగా బియ్యం అందేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు. స మస్యను పరిష్కరిస్తామని ఆయన వారికి హామీ ఇచ్చారు.

ప్రభుత్వ ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించాలి

ఉరవకొండ, ఆగస్టు 6: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు వెంటనే ఐఆర్ ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి నరసింహులు పేర్కొన్నారు. పట్టణంలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో మంగళవారం ఏపీటీఎఫ్ కార్యవర్గ సమావేశం జరిగింది. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 11వ పీఆర్సీకి సంబంధించి ఉద్యోగులకు రావాల్సి బకాయిలు వెంటనే ఇవ్వాలన్నారు. అలాగే జీవో నెంబర్ 117ను రద్దు చేయాలన్నారు. నాడు- నేడు రెండో విడత పాఠశాలలో పనులు పూర్తి చేయడానికి నిధులు కేటాయించాలన్నారు. సమావేశంలో నాయకులు హనుమప్ప, సాకేభాస్కర్, నజీర్, నరసింహులు, పాండురంగ, ఓబన్న, రామకృష్ణ పాల్గొన్నారు.

వర్షం కోసం పూజలు

గుత్తి, ఆగస్టు 6: వర్షం కురవాలని కోరుతూ పట్టణంలోని లచ్చానుపల్లి రోడ్డులో గల జగనన్న కాలనీ వద్ద నూతనంగా నిర్మించిన పెద్దమ్మ ఆలయంలో మంగళవారం కాలనీవాసులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి నైవేద్యాలు, కొబ్బరికాయలు సమర్పించి పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని కోరుకున్నారు.

నేడు మండల సమావేశం

కణేకల్లు, ఆగస్టు 6: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారంమండల సర్వసభ్య సమావేశం జరగనుందని, ఇందుకు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు హాజరు కానున్నారని టీడీపీ మండల కన్వీనర్ లాలెప్ప మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభం కానున్నట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

గుత్తి రూరల్, ఆగస్టు 6: మండలంలోని తొండపాడు వద్దగల 67వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. గొందిపల్లికి చెందిన రామాంజునేయులు తన ఆటోలో రాయలచెరువుకు ప్రయాణికులతో బయలుదేరాడు. తొండపాడు గ్రామంలోకి రాగానే వెనుక నుంచి లారీ ఢీ కొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న జక్కులచెరువుకు చెందిన శ్రీనివాసులు, హుసేన్ పీరా ఇసురాళ్లపల్లికి చెందిన లక్ష్మీదేవితో పాటు డ్రైవర్ రామాంజునేయులుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వారిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం శ్రీనివాసులు, రామాంజునేయులును అనంతపురానికి తరలించారు. ఘటన పై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఏ. కొండాపురం శివారులో ముగ్గురికి..

పుట్లూరు: మండలంలోని ఏ. కొండాపురం గ్రామశివారులోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద మంగళవారం ఆటోను వెనుక నుంచి వచ్చిన టాటా ఏస్ వాహనం ఢీకొట్టడంతో ముగ్గురు గాయాలపాలయ్యారు. నార్పల మండలం కేశేపల్లికి చెందిన సాయికుమార్, రవితేజ, కల్యాణ్ బేల్దారి పనిచేసేందుకు తాడిపత్రికి ఆటోలో వస్తుండగా ప్రమాదం జరిగింది. స్థానికులు చికిత్స నిమిత్తం వారిని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య

కళ్యాణదుర్గం రూరల్, ఆగస్టు 6: పట్టణంలో జీవితంపై విరక్తితో ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన గంగాధర (45) బేల్దారి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. కాగా కొన్ని నెలలుగా కడుపునొప్పి, కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. అనంతపురం, కర్నూలు తదితర ప్రాంతాలలో చికిత్స పొందినా నయంకాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన అతను మంగళవారం పట్టణ సమీపంలో ఉన్న తెల్లదిబ్బ కొండలోకి వెళ్లి చెట్టుకు లుంగీతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడికి భార్య గంగమ్మ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వృద్ధురాలి మృతి

కూడేరు, ఆగస్టు 6: మండలంలోని ఎంఎం హళ్లి గ్రామంలో ఓ వృద్ధురాలు విద్యుదాఘాతంతో మృతి చెందింది. కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వృద్ధురాలు అక్కమ్మ (70) మంగళవారం ఉదయం దొడ్లో పశువులను కట్టేసేందుకు మనవడిని ఎత్తుకెళ్లింది. పశువులను కట్టేసి ఇంటికి వస్తుండగా మార్గంమధ్యలో విద్యుత్ స్తంభం స్టే వైరు తెగి కిందకు వేళాడుతోంది. గమనించని అక్కమ్మ ఆ వైరును తగిలింది. దీంతో కరెంట్ షాక్ కొట్టడంతో మనవడిని పక్కకు పడేసింది. ఆమె మాత్రం షాక్‌కు గురైంది. సమీపంలో ఉన్న కుటుంబ సభ్యులు వెళ్లి చూసే సరికి మృతి చెందింది. పోలీసులు, విద్యుత్ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆమె కుమారుడు మహేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ వెంటనే ఆ కుటుంబానికి న్యాయం చేయాలని కలెక్టర్‌ను, విద్యుత్ శాఖ ఎస్ఈను ఆదేశించారు. ప్రమాదంపై విచారణ జరపాలని తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా.. వ్యక్తి మృతి

పెద్దవడుగూరు, ఆగస్టు 6: మండలకేంద్రం సమీపంలోని లక్షుంపల్లికి వెళ్లే రహదారిలో ట్రాక్టర్ బోల్తాపడి ఒకరు మృతి చెందగా.. ఇద్దరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. నంద్యాలజిల్లా కొలిమిగుండ్ల మండలం కనకాద్రిపల్లి గ్రామానికి చెందిన పెద్ద సూర్యనారాయణరెడ్డి (60), శివశంకర్‌రెడ్డి, మద్దిలేటి సోమవారం అర్ధరాత్రి కొలిమిగుండ్ల నుంచి పామిడికి నాపరాళ్లను ట్రాక్టర్‌లో తరలిస్తున్నారు. వడుగూరు సమీపంలో ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న గోతిలో పడింది. ప్రమాదంలో సూర్యనారాయణరెడ్డి మృతి చెందగా.. శివశంకర్‌రెడ్డి, మద్దిలేటికి గాయాలయ్యాయి. స్థానికులు గాయపడిన వారిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సూర్యనారాయణరెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పామిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ రెడ్డెప్ప తెలిపారు.

వైసీపీ గూండాలకు కొమ్ముకాస్తున్న పోలీసులు

● ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ధ్వజం



ఆస్పత్రిలో బాధితురాలిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కాలవ

రాయదుర్గం, ఆగస్టు 6: కొందరు పోలీసు అధికారులు వైసీపీ గూండాలకు కొమ్ముకాస్తున్నారని, ఇది ఎంతో దురదృష్టకరమని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ధ్వజమెత్తారు. గుమ్మఘట్ట మండలం బీటీపీ గ్రామంలో గత ఆదివారం రాత్రి వైసీపీ నాయకుడు గోవిందు చేసిన దాడిలో గాయపడిన బాలింత చంద్రకళ పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతుండగా.. ఎమ్మెల్యే కాలువ మంగళవారం వెళ్లి పరామర్శించారు. దాడికి సంబంధించిన కారణాలను, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీటీపీ గ్రామంలో ఐటీడీపీ ప్రతినిధి రవిచంద్ర ఇంటిపై వైసీపీ నాయకుడు గోవిందు దాడి చేస్తే అడ్డుకోబోయిన బాలింతను విచక్షణా రహితంగా కాళ్లతో తన్ని రాళ్లతో దాడి చేయడం శోచనీయమన్నారు. పచ్చిబాలింత అని కూడా చూడకుండా జరిపిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వంలో ఇలాంటి దాడులకు ఆస్కారం ఉండకూడదన్నారు. వైసీపీ నాయకుడు ఐటీడీపీ ప్రతినిధి ఇంటిపై దాడి చేసి మహిళలను గాయపరిచినా.. ఎస్ఐ బాధితురాలిపైనే రివర్స్‌పై కేసు పెట్టడం దుర్మార్గమని మండిపడ్డారు. కొందరు అవినీతి, అసమర్థత పోలీసుల వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తే ఏమాత్రం సహించమని హెచ్చరించారు. సంబంధిత ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని ఎస్పీకి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. దాడి చేసిన వైసీపీ నాయకుడు గోవిందుపై పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, నాయకులు టంకశాల హనుమంతు, కాలవ సన్నన్న, చిన్న క్రిష్ణయ్య, సంజీవ, గంగాధర తదితరులు పాల్గొన్నారు.

భూఆక్రమణపై చర్యలు తీసుకోవాలని వినతి

గుంతకల్లు, ఆగస్టు 6: పట్టణంలోని సమ్మర్ స్టోరేజీ ట్యాంకుకు సంబంధించిన స్థలాన్ని కొందరు ఆక్రమించి ప్లాట్లను వేసి విక్రయిస్తున్నారని, వెంటనే చర్యలు తీసుకోవాలంటూ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కోడెల అపర్ణ కమిషనర్ రమణయ్యను కోరారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయానికి మంగళవారం ఉదయం ఆమె వెళ్లి కమిషనర్‌ను కలిసి మాట్లాడారు. రిజర్వాయర్ కోసం మున్సిపాలిటీ రైతులకు డబ్బు చెల్లించి భూ సేకరణ చేసిందన్నారు. సేకరించిన భూమిలో కొంత మిగలగా శ్మశానానికి, కంపోస్టు యార్డుకు కేటాయించి, మరి కొంతభూమిని చేంజ్ ఆఫ్ ల్యాండ్ చేయడం జరిగిందన్నారు. ఇంకా మిగిలి ఉన్న దాదాపు 5 ఎకరాలను కొందరు చదును ప్లాట్లకు వేసి అక్రమంగా విక్రయిస్తున్నారన్నారు. కోట్ల రూపాయల విలువైన ఆ భూమి చేజారకుండా చర్యలు తీసుకోవాలని, ప్రహరీ నిర్మించాలని కోరారు. ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కోడెల చంద్రశేఖర్, లక్ష్మినారాయణ తదితరులు ఉన్నారు.

గద్దర్‌కు ఘన నివాళి

ఉరవకొండ, ఆగస్టు 6: పట్టణంలోని పాత బస్టాండ్‌లో మంగళవారం ప్రజాగాయకుడు గద్దర్ ప్రథమ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీపీఐ నాయకులు శివన్న మాట్లాడుతూ పోరహక్కులలో గద్దర్ పాత్ర మరువలేనిదని కొనియాడారు. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర వహించారన్నారు. గద్దర్ ఆశయాల కోసం పాటు పడదామన్నారు. కార్యక్రమంలో గద్దర్ వర్ధంతి నిర్వహణ కమిటీ సభ్యులు ఆనంద్‌రాజు, ఈశ్వర్, ఎర్రిస్వామి, టీడీపీ నాయకులు గోవిందు, మరుట్ల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఐఓసీలో ఉద్యోగావకాశాలు కల్పించాలి

గుంతకల్లుటౌన్, ఆగస్టు 6: ఐఓసీ డిపో నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతుల పిల్లలకు ఉద్యోగ అవకాశాలను కల్పించాలని నక్కనదొడ్డి పంచాయతీ మాజీ సర్పంచు తులసీరామ్‌చౌదరి, గ్రామస్థులు కోరారు. ఈ మేరకు పట్టణంలో మంగళవారం ఆర్డీఓ శ్రీనివాసుల రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. మాజీ సర్పంచు మాట్లాడుతూ ఐఓసీ డిపో వస్తే పంచాయతీ అభివృద్ధి చెందుతుందని, నిరుద్యోగులకు ఉద్యోగఅవకాశాలు వస్తాయన్న ఆశతో నక్కనదొడ్డి పంచాయతీలోని నక్కనదొడ్డి, నరసాపురం, ఎన్‌తండా, ఎన్‌కొట్టాల గ్రామాల రైతులు భూములు ఇచ్చారన్నారు. అయితే డిపో ప్రారంభమైన తరువాత మా పంచాయతీకి మొండిచేయి చూపారన్నారు. అధికారులు, కాంట్రాక్టర్ ఇతరులకు ఉద్యోగాలు అమ్ముకున్నారన్నారు. గ్రామాలలో సీసీరోడ్లు, డ్రైనేజీలు, పశు వైద్యశాల, తాగునీటి ప్లాంట్‌లను ఏర్పాటు చేస్తామని చెప్పి పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా న్యాయం చేయాలని వారు కోరారు.

మట్టిని అక్రమంగా తరలిస్తే చర్యలు

డీ.హీరేహాళ్, ఆగస్టు 6: మండలంలో అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి హెచ్చరించారు. గత సోమవారం కొందరు లారీలు, ట్రాక్టర్లు, టిప్పర్లలో అక్రమంగా మట్టి తరలిస్తున్నారని పలు పత్రికల్లో కథనం ప్రచురితమైంది. దీంతో మంగళవారం ఈ విషయంపై మైన్స్ ఏజే రామకృష్ణప్రసాద్, సెబ్ సీఐ మురళీమోహన్, తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తదితరులు విచారణ చేపట్టారు. మట్టి తరలించిన ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో పోలీస్‌సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో మట్టి అక్రమంగా తరలిపోకుండా చూడాలని తెలిపారు. గ్రామస్థాయి అధికారులు ప్రతినిత్యం అందుబాటులో ఉంటూ మట్టి అక్రమంగా తరలుతుంటే తమ దృష్టికి తీసుకురావాలని సేచించారు.

బాలికలకు అథ్లెటిక్స్ పోటీలు

తాడిపత్రి, ఆగస్టు 6: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మంగళవారం ఆర్డీటీ ఆధ్వర్యంలో అండర్ 14, 16 విభాగాల్లో బాలికలకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించినట్లు ఏరియా కోఆర్డినేటర్ లలిత తెలిపారు. హైజంప్, లాంగ్‌జంప్, షాట్‌పుట్‌తో పాటు 200 మీటర్లు, 600మీటర్ల పరుగు పందెం పోటీలను నిర్వహించామన్నారు. ఈ పోటీల్లో 13ప్రభుత్వ పాఠశాలల నుంచి మొత్తం 140మంది బాలికలు పాల్గొన్నారన్నారు. గెలుపొందిన వారికి బహుమతులను అందించామన్నారు. ప్రథమ స్థానంలో గెలుపొందిన వారు జిల్లాకేంద్రంలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. బాలికల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీసేందుకే పోటీలను నిర్వహించినట్లు ఆమె పేర్కొన్నారు.

తల్లిపాల వారోత్సవాలు

గుత్తి, ఆగస్టు 6: పట్టణంలోని చాకలి వీధిలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ ఢిల్లీశ్వరి, ఏపీ మహిళా కమిషన్ సభ్యురాలు రుకీయాబేగం మాట్లాడుతూ పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రు పాలు తాపించడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ బిడ్డకు మురుపాలు తాపాలన్నారు. తర్వాత ఐదుగురు గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. అలాగే ఆరునెలలు పూర్తి అయిన పిల్లలకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగేశ్వరి, అంగన్‌వాడీ వర్కర్లు భారతి, భార్గవరాణి, నాగరత్నమ్మ, చంద్రలీల, భావమ్మ, మహబుబీ, సరోజ పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండలంలోని శ్రీరంగాపురం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు లక్ష్మీలావణ్య, సునీత విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. అంగన్‌వాడీ సిబ్బంది, గర్భిణులు పాల్గొన్నారు.

కుష్టుపై అవగాహన

పెద్దవడుగూరు, ఆగస్టు 6: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం కుష్టు వ్యాధిపై ప్రజలకు లెప్రసీ ప్రాజెక్టు డైరెక్టర్ దేవసాగర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సరైన సమయంలో చికిత్స తీసుకుంటే ఈ వ్యాధి పూర్తిగా నయమవుతుందన్నారు. శరీరంలో స్పర్శ లేని రాగిరంగు మచ్చలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. వైద్య సిబ్బంది క్రమం తప్పకుండా గ్రామాల్లో పర్యటిస్తూ వ్యాధిపట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం మండలంలో కుష్టువ్యాధిగ్రస్తులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీనివాసబాబు, గంగాధర్, హెల్త్‌సూపర్‌వైజర్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొలతల్లో తేడాలొస్తే చర్యలు

యాడికి, ఆగస్టు 6: పెట్రోల్, డీజిల్ కొలతల్లో, ధరల్లో తేడాలు వస్తే చర్యలు తప్పవని ఇన్‌చార్జి తహసీల్దార్ బాలమ్మ హెచ్చరించారు. రాయలచెరువులోని పెట్రోల్ బంక్‌ను రెవెన్యూ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. పెట్రోల్, డీజిల్ సాంద్రతలను పరిశీలించారు. విక్రయ ధరలపై సిబ్బందిని, వినియోగదారులను ఆరాతీశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి తహసీల్దార్ మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్ కొలతల్లో తేడాలు లేకుండా విక్రయాలు జరపాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే అమ్మాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో సీఎస్‌డీటీ సూర్యనారాయణ, ఆర్ఐ ఆనంద్‌బాబు ఆచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రియురాలిపై ప్రియుడి దాష్టీకం

● పెట్రోల్ పోసి నిప్పంటించిన వైనం

రాయదుర్గంరూరల్, ఆగస్టు 6: పార్వతి అనే మహిళపై ఆమె ప్రియుడు మోహన్ పెట్రోల్ పోసి నిప్పంటించిన సంఘటన పట్టణంలోని రాజీవ్‌గాంధీకాలనీలో మంగళవారం చోటు చేసుకుంది. గత మే నెలలో 12వ తేదీన మోహన్‌పై పార్వతి పెట్రోల్ పోసి నిప్పంటించింది. అతను గాయాలతో బయటపడ్డాడు. కాగా ఈ సంఘటన మనసులో పెట్టుకుని మంగళవారం సాయంత్రం పార్వతిపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. స్థానికులు గమనించి మంటలను ఆర్పివేసి ఆమెను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రాయదుర్గం సివిల్ కోర్టు న్యాయాధికారి రమ్య ఆసుపత్రికి చేరుకొని బాధితురాలితో వాంగ్మూలం తీసుకున్నారు. సీఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మూఢ నమ్మకాలు సమాజానికి చేటు

రాయదుర్గంరూరల్, ఆగస్టు 6: మూఢ నమ్మకాల వల్ల సమాజానికి చేటు కలుగుతుందని మానవత స్వేచ్ఛ వ్యవస్థాపకుడు తరిమెల అమర్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, పీవీఆర్ ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు మంగళవారం ఆయన మూఢనమ్మకాలపై జరిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాయలు, మంత్రాలు ఉండవని, సైన్స్ మాత్రమే శాశ్వతమని తెలిపారు. ఎవరూ కూడా మూఢ నమ్మకాలను నమ్మరాదని సూచించారు. కార్యక్రమంలో మానవత కో కన్వీనర్ సలాం మాలిక్, జనవిజ్ఞానవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కెంచె లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకులు సత్యనారాయణ, ఎంజీ వీరన్న, సోషల్ మీడియా ఇన్‌చార్జి ఆవుల మనోహర్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రి, ఆగస్టు 6: మండలంలోని సజ్జలదిన్నె జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన బడి పథకంలో భాగంగా నాణ్యమైన భోజనం వడ్డిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే చెప్పాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే స్వయంగా విద్యార్థులకు భోజనాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా భోజనం ఎలా ఉందంటూ ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చర్చి వార్షికోత్సవానికి హాజరు

పట్టణంలోని నందలపాడు సీఎస్ఐ చర్చి 6వ వార్షికోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రైస్తవులు ఎమ్మెల్యేకు శాలువాకప్పి సన్మానించారు. వేడుకల్లో భాగంగా ఎమ్మెల్యేతో కేక్‌కట్ చేయించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయన వెంట నాయకులు హరినాథ్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, నరేంద్రనాయుడు, కౌన్సిలర్ విజ్జి, డేనియల్, పావురాల శీన, హరి, నాగరాజు తదితరులు ఉన్నారు.

జంప్ రోప్ క్రీడల్లో సత్తా

● ప్రతిభ చూపిన గిరిజన విద్యార్థి



సంతోష్ నాయక్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయుడు, స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

గుత్తి రూరల్, ఆగస్టు 6: మండలంలోని సేవాఘడ్ గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థి సంతోష్ నాయక్ జపాన్‌లో జరిగిన ఏసియన్ జంప్ రోప్ పోటీలలో పాల్గొని.. స్వస్థలానికి మంగళవారం తిరిగొచ్చాడు. గత నెల 22 నుంచి 30వ తేదీ వరకు జరిగిన పోటీలలో 11 దేశాలు క్రీడాకారులు పాల్గొన్నారని పీఈటీ విజయ నాయక్ తెలిపారు. మన దేశం తరుఫున సేవాఘడ్ పాఠశాల 8వ తరగతి విద్యార్థి సంతోష్ నాయక్ జంప్ రోప్ పోటీలలో ఎనిమిదో ర్యాంక్ సాధించాడని తెలిపారు. అరుదైన ఘనత సాధించిన సంతోష్‌కు ప్రిన్స్‌పాల్ ఫయాజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి: సీపీఐ



కొర్రపంటను పరిశీలిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి

యాడికి, ఆగస్టు 6: ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు వర్షాలు లేక ఎండిపోయే పరిస్థితి నెలకొందని, దీంతో రైతులకు నష్టాలు తప్పేలా లేవని, వారిని ఆదుకోవడానికి ప్రభుత్వం ముందుకు రావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ కోరారు. మండలంలోని వేములపాడు వద్ద ఎండిపోతున్న కొర్ర పంటను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండలంలో ఖరీఫ్ సాగు ఆశాజనకంగా లేదన్నారు. వర్షాలు లేక వేరుశనగ, పత్తి, కొర్ర, ఆముదం పంటలన్నీ ఎండిపోతున్నాయని తెలిపారు. గత ప్రభుత్వం యాడికిని కరువు మండలంగా ప్రకటించినప్పటికీ ఎలాంటి కరువు సహాయక చర్యలు అందించలేదన్నారు. ఈ ఏడాది అప్పులు చేసి రైతులు ఖరీఫ్‌సాగు చేశారన్నారు. అయితే వరుణుడు కరుణించకపోవడంతో పంటలన్నీ ఎండుముఖం పట్టాయన్నారు. కనుక రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు. రబీ సాగుకు వందశాతం సబ్సిడీతో ప్రత్యామ్నాయ విత్తనాలు అందించాలని తెలిపారు. ఆయన వెంట సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రంగయ్య, మండల ప్రధాన కార్యదర్శి జూటూరు రఫీ, రైతు సంఘం నాయకుడు వెంకటరాముడుయాద్ తదితరులు ఉన్నారు.

అమరావతి నిర్మాణానికి విరాళం



ఎమ్మెల్యేకు చెక్కును ఇస్తున్న రిటైర్డ్ ఉద్యోగి

తాడిపత్రి, ఆగస్టు 6: అమరావతి నిర్మాణం కోసం ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డికి పట్టణానికి చెందిన రిటైర్డ్ విలేజ్ డెవలప్‌మెంట్ అధికారి నరసింహులు తన నెల పింఛన్ రూ.52,242లను విరాళంగా అందించారు. ఆయన ఎమ్మెల్యేను స్థానిక నివాసంలో మంగళవారం కలిసి చెక్కును అందజేశారు. అమరావతి అభివృద్ధి కోసం తనవంతు సాయంగా ఈ విరాళం అందించానని తెలిపారు.

సామాజిక తనిఖీపై ప్రజావేదిక

డి.హీరేహాళ్, ఆగస్టు 6: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మంగళవారం ప్రజావేదిక ఏర్పాటు చేశారు. ఇందులో 11 నెలల పాటు 16 గ్రామ పంచాయతీల్లో రూ. 7 కోట్ల వ్యయంతో చేపట్టిన ఉపాధిపనులను సామాజిక తనిఖీ బృందం వారం రోజుల పాటు విచారణ చేసి ఆ వివరాలను వెల్లడించారు. అయితే తనిఖీలో కేవలం రూ. 51 వేలు మాత్రమే అవినీతి జరిగినట్లు తెలియజేశారు. కోట్ల రూపాయల వ్యయంతో పనులు జరిగితే కేవలం వేల రూపాయలల్లో అవినీతి జరిగిందని చెప్పడం చూస్తుంటే సామాజిక తనిఖీ తూతూమంత్రంగా జరిగినట్లు అనిపిస్తోందని ప్రజలు చర్చించుకున్నారు. విచారణ చూస్తే కొండను తవ్వి ఎలుకను పట్టినట్టుగా కనిపిస్తోందని గుసగుసలాడారు. కార్యక్రమంలో ఏపీడీ సుధాకర్‌రెడ్డి, విజిలెన్స్ అధికారి పరమేష్, ఎస్ఆర్‌పీ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ రఘునాథ్ పాల్గొన్నారు.

కుందుర్పిమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

కుందుర్పి, ఆగస్టు 6: మండల కేంద్రంలో గ్రామదేవత అయిన కుందుర్పిమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయమే అర్చకులు అమ్మవారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు పొందారు.

ఇద్దరిపై కేసు నమోదు

రాయదుర్గంరూరల్, ఆగస్టు 6 : మండలంలోని పల్లేపల్లి గ్రామానికి చెందిన నాగజ్జప్ప కమారులు చిన్నముత్తప్ప, పెద్ద ముత్తప్పపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. చిన్నముత్తప్ప, పెద్దముత్తప్పలు గొర్రెలు మేపే విషయంలో గత సోమవారం అదే గ్రామానికి చెందిన నాగన్న, తిప్పేస్వామిలతో గొడవపడి దాడి చేసి గాయపరిచారని, దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు ఆ ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు. గాయపడి పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న నాగన్న, తిప్పేస్వామిలను ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పరామర్శించారు.

పుప్పాలతండాలో వైద్యశిబిరం

యాడికి, ఆగస్టు 6: మండలంలోని పుప్పాల తండాలో మంగళవారం జిల్లా న్యాయసేవల అథారిటీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం జరిగింది. ముఖ్యఅతిథిగా అనంతపురం సీనియర్ సివిల్ న్యాయాధికారి శివప్రసాద్‌యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అమలులో ఉన్న గిరిజన హక్కుల పథకం 2015 గురించి, గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం ఉన్న పథకాల గురించి స్థానికులకు వివరించారు. తర్వాత వైద్యశిబిరంలో 93మంది గిరిజనులు పాల్గొని వైద్యపరీక్షలు చేయించుకున్నారు. సమావేశంలో మండల ప్రత్యేక అధికారి రామాంజనేయులు, ఎంపీడీఓ సావిత్రి, ఇన్‌చార్జి తహశీల్దార్ బాలమ్మ, సీఐ నాగార్జునరెడ్డి, ఈఓపీఆర్‌డీ వెంకటేష్, సర్పంచు దేవేంద్ర, పంచాయతీ కార్యదర్శి వసుంధర, వైద్యులు పాల్గొన్నారు.

ఆలయ ముఖద్వారం నిర్మాణానికి విరాళం

రాయదుర్గంరూరల్, ఆగస్టు 6 : మండలంలోని గ్రామదట్ల గ్రామంలో మారెమ్మ ఆలయ ముఖద్వారం నిర్మాణానికి టీడీపీ సీనియర్ నాయకుడు భీమసేన్‌రావు రూ. 50 వేలు విరాళంగా అందించారు. ఇందుకు సంబంధించిన చెక్కును పట్టణంలోని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు నివాసంలో మంగళవారం ఎమ్మెల్యే చేతుల మీదుగా గ్రామస్థులకు అందించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ హనుమంతు, సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి, ఉపసర్పంచ్ రమేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదంపై విచారణ

విడపనకల్లు, ఆగస్టు 6: మండలంలోని గడేకల్లులో గత శనివారం జరిగిన విద్యుత్ ప్రమాదంపై విజిలెన్స్ అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. విజిలెన్స్ అధికారి ఆదినారాయణ అధ్వర్యంలో అధికారుల బృందం గ్రామంలోని రైతుల పొలాల్లో కి చేరుకుని రైతులను విచారించారు. పాతిన విద్యుత్ స్తంభాలను ఎందుకు తొలగించారు, వన్నూరుస్వామి విద్యుత్ ప్రమాదం ఎలా జరిగింది అన్న వాటిపై విచారించారు. ఇందులో పోల్ టూ పోల్ మ్యాన్ మహబూబ్ బాషా ఎల్‌సీ ఇవ్వటంలో నిర్లక్ష్యం ఏమైనా ఉందా అని ఆరా తీశారు. అనంతరం మండలకేంద్రంలోని విద్యుత్ కార్యాలయం చేరుకుని రైతులను ఒక్కొక్కరిగా విచారించారు. గడేకల్లులో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు చేసిన పనులకు అనుమతులు ఉన్నాయా లేదా అని రికార్డులు పరిశీలించి పూర్తి స్థాయి నివేదికలు జిల్లా ఉన్నతాధికారులుకు అందజేస్తాము తెలిపారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారులు, విద్యుత్ ఏఈ సత్యం, సిబ్బంది పాల్గొన్నారు.


నియామకం

పామిడి, ఆగస్టు 6 : ఎరుకల ప్రజా పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ముసాది మారెప్పను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు సాకే గోవిందు మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఎరుకల ప్రజా సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఈ సందర్భంగా మారెప్ప తెలిపారు.

జలచౌర్యానికి పాల్పడితే చర్యలు

బొమ్మనహాళ్, ఆగస్టు 6 : ఎగువ కాలువ నుంచి ఆయకట్టుకు వచ్చే నీటిని పిల్ల కాలువల ద్వారా జలచౌర్యానికి పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని అనంతపురం హెచ్చెల్సీ ఈఈ రమణారెడ్డి హెచ్చరించారు. డిస్ట్రిబ్యూటరీ ద్వారా వచ్చే నీటిని నాన్‌ఆయకట్టుదారులు పైపులు వేసి జలచౌర్యానికి పాల్పడుతున్నారని గ్రీవెన్స్‌లో కొందరు రైతులు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం అధికారులు మండలంలోని డిస్ట్రిబ్యూటరీ ద్వారా పిల్ల కాలువలకు పైపులు వేసి నీటిని అక్రమంగా వాడుకుంటున్నట్లు గుర్తించి పైపులను ధ్వంసం చేయించారు. ఈఈ రమణారెడ్డి మాట్లాడుతూ జలచౌర్యానికి పాల్పడే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆయకట్టుదారులకు ఇబ్బంది కలుగకుండా సాగునీటిని అందిస్తామని తెలిపారు. డీఈఈ మద్దిలేటి, జేఈఈ అల్తాఫ్ ఉన్నారు.

బంజారాలకు ఎమ్మెల్సీ ఇవ్వాలి



మంత్రిని సన్మానిస్తున్న బంజారా సంఘం నాయకులు

ఉరవకొండ, ఆగస్టు 6: బంజారాల కు ఎమ్మెల్సీ ఇవ్వాలని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను బంజారా సంఘం నాయకులు కోరారు. అమరావతిలోని సచివాలయంలో మంగళవారం వారు మంత్రిని కలిసి బంజారా సంప్రదాయ రీతిలో ఎర్ర తలపాగాతో సన్మానించి సేవాలాల్ చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం మాట్లాడుతూ బంజారాలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించి ఎమ్మెల్సీ ఇవ్వాలని విన్నవించారు. సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలకు రూ.50లక్షల నిధులు కేటాయించాలని ప్రభుత్వానికి ప్రతిపాదించినందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బంజారా సంఘం నాయకులు మహేష్‌నాయక్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు తులసీదాస్ నాయక్ పాల్గొన్నారు.